ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
సోమవారం 30 జూన్ 2025

ఉష్ణోగ్రత (అంచనా)

30-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	34	27
తెనాలి	34	27
నరసరావుపేట	35	27
బాపట్ల	36	29
రెంటచింతల	34	27
చీరాల	36	29



రాజధాని పనులపై నేడు సమీక్ష

- అమరావతిలో ప్రపంచ బ్యాంకు బృందం పర్యటన
- సీఆర్‌డీఏ అధికారుల నుంచి పనుల వివరాల సేకరణ
- పరిశీలనతో మలివిడత నిధుల విడుదలకు సానుకూలత

విజయవాడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనుల పరిశీలనకు ప్రపంచ బ్యాంకు జాయింట్ ఇంప్లిమెంటేషన్ సపోర్ట్ మిషన్ టీమ్ విజయవాడ వచ్చింది. ప్రాజెక్టు పనులపై సోమవారం ఈ బృందం సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులు, అధికారులతో సమీక్ష జరప నుంది. అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన తర్వాత పనులు జరుగుతున్నాయి. వీటిలో ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టేవి సింహభాగం ఉన్నాయి. ఈ పనులకు సంబంధించి ప్రపంచబ్యాంకు బృంద సభ్యులు అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటారు. సీఆర్‌డీఏ అధికారులతో సమావేశం తర్వాత ప్రపంచబ్యాంకు బృందం క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించనున్నది. హెచ్‌వోడీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్లు, అఖిలభారత సర్వీసు (ఏఐఎస్) టవర్లు, మంత్రులు, హెచ్‌వోడీల బంగళాలతో పాటు రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించనున్నది. ఈ పరిశీలనను బట్టి మలివిడత నిధుల విడుదలకు సానుకూలత ఏర్పడుతుంది.

రుణ సంస్థలతో చర్చలు

అమరావతిలో ప్రస్తుతం సొంత నిధులతో చేపడుతున్న ప్రాజెక్టు పనులు, ఇంకా తలపెట్టాల్సిన పనులకు సంబంధించిన నిధుల కోసం సీఆర్‌డీఏ అధికారులు రుణ సంస్థలతో చర్చలు జరుపుతున్నారు. ఇప్పటికే బ్యాంకుల కన్సార్టియంతో చర్చలు ప్రారంభించారు. బ్యాంకింగ్ నిబంధనల ప్రకారం ఖాళీ స్థలాల పూచీకత్తుగా రుణాలు ఇవ్వడం జరగదు. ఆ స్థలాల్లో ఏదైనా నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉంటే, రుణాలు ఇస్తాయి. ఇప్పటికిప్పుడు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవాలంటే గ్రౌండ్‌వర్క్ చేయాల్సిన అవసరం ఉంది. అందుకే సీఆర్‌డీఏ అధికారులు నిర్మాణ ప్రాజెక్టులు, రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించి ఆస్తి వ్యక్తీకరణల ప్రకారం రెసిడెన్షియల్, కమర్షియల్ స్పేస్ అభివృద్ధికి ముందుకు వచ్చే సంస్థలకు సంబంధించి త్వరగా అగ్రిమెంట్లు కుదుర్చుకోవాలని అధికారులు భావిస్తున్నారు. భూముల్లో నిర్మాణ పనులు చేపట్టే అవకాశం ఉంటే రుణాలు వచ్చే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని సీఆర్‌డీఏ అధికారులు బ్యాంకింగ్ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నారు.

బీవోటీ విధానంలో ఇన్నర్ రింగ్‌రోడ్డు నిర్మాణం

మూడు నెలల్లో అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు(ఐఆర్ఆర్)ను పట్టాలెక్కించాలని సీఆర్‌డీఏ అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇన్నర్ రింగ్‌రోడ్డును పూర్తిగా బీవోటీ విధానంలో నిర్మించాలని నిర్ణయించారు. రాజధాని అమరావతి చుట్టూ వలయాకారంగా 75 మీటర్ల వెడల్పున, 96.25 కిలోమీటర్ల పొడవున నిర్మించే ఇన్నర్ రింగ్‌రోడ్డుకు గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలో 3,556.17 ఎకరాలు అవసరమవుతాయి. అమరావతి రెండో దశ భూ సమీకరణ వల్ల గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో 2,400.76 ఎకరాలను సేకరించాల్సిన అవసరం లేకుండా పోతోంది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో 1,155.41 ఎకరాలను మాత్రం తీసుకో వాల్సి ఉంటుంది. ఈ భూములను కూడా భూ సమీకరణ విధానంలో తీసుకోవాలనుకుంటున్నట్టు సీఆర్‌డీఏ వర్గాలు చెబుతున్నాయి మూడు నెలల్లో ఈ ప్రక్రియను పూర్తిచేసి టెండర్లు పిలవాలనుకుంటున్నారు.

బర్లీకి.. బొనంజా

పొగాకు రైతులకు డబుల్ ధమాకా

- రంగంలోకి మార్క్‌ఫెడ్‌తో కంపెనీలూ కొనుగోళ్లు
- ఆశాజనకమైన ధర ఇస్తామంటూ రాయబేరాలు
- కేంద్రాల్లో ఊపందుకున్న బర్లీ పొగాకు కొనుగోళ్లు
- మరో 12 కేంద్రాలను తెరిచేందుకు మార్క్‌ఫెడ్ సన్నాహాలు

(బాపట్ల, పర్చూరు–ఆంధ్రజ్యోతి)

ఆశించిన మేర దిగుబడులు వచ్చినా.. ధర లేక కొన్నాళ్లు.. కొనుగోలు చేసేవారు లేక మరికొన్నాళ్లు ఆందోళన చెందిన బర్లీ పొగాకు రైతులు పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి కొనుగోళ్లు చేపట్టడంతో పొగాకు కంపెనీలు కూడా కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నాయి. దీంతో బర్లీ రైతులకు డబుల్ ధమాకా లబ్ధి చేకూరుతోంది. ఇటీవల వరకు కొనుగోలు చేసే వారు లేక కొందరైతే అప్పులు పాలై ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. మళ్లీ పొగాకు సాగుచేయం ఎలాగోలా కొనుగోలు చేయండని రైతులు కన్నీటి పర్యంతమైనా కంపెనీలు స్పందించలేదు. బర్లీ రైతుల నుంచి కొనుగోళ్లు చేయాలని పొగాకు కంపెనీలను ప్రభుత్వం ఆదేశించినా ఫలితం లేకుండా పోయింది. చివరకు ప్రభుత్వమే దేశంలో ఎక్కడా ఇప్పటి వరకు జరగనట్లుగా మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి బర్లీ పొగాకు కొనుగోళ్లు చేపట్టింది. అంతేగాక ప్రత్యేకంగా నిధులను కూడా కేటాయించి కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో నగదు జమయ్యేలా చర్యలు తీసుకుంది. కొనుగోళ్లు చేపట్టాలని పదేపదే కంపెనీలకు ప్రభుత్వం చేసిన విజ్ఞప్తులు నిన్న వరకు పట్టించుకోని కంపెనీలు ఇప్పుడు రైతుల వద్దకు (మిగతా 6వ పేజీలో)



కొనుగోలు కేంద్రంలో పొగాకు తేమ శాతం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి, కలెక్టర్ వెంకటమురళి (పాతచిత్రం)

ఇంటింటికి మంచి ప్రభుత్వం

2 నుంచి టీడీపీ శ్రేణుల సమాయత్తం

- ఏడాది అభివృద్ధి.. సంక్షేమంపై వినూత్న ప్రచారం
- వార్డు, గ్రామ స్థాయిలో చేసిన పనులపై కరపత్రాలు
- దిశానిర్దేశం చేసిన టీడీపీ అధినేత.. ముఖ్యమంత్రి చంద్రబాబు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచింది. ఈ ఏడాదిలో సంక్షేమ కార్యక్రమాల అమలుతో పాటు ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయి. ఈ ఏడాదిలో జరిగిన మంచి గురించి ప్రజలను నేరుగా కలిసి వివరించేందుకు తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు 'మంచి ప్రభుత్వం' పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నేతలు, ప్రజాప్రతినిధులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాల గురించి వివరించాలని అధినేత దిశానిర్దేశం చేశారు. దీంతో బుధవారం నుంచి గ్రామ, వార్డు స్థాయిలో ఇంటింటికి టీడీపీ శ్రేణులు వెళ్లనున్నాయి. గత ఐదేళ్లలో వైసీపీ సాగించిన అరాచక పాలనను ప్రజలకు పార్టీ శ్రేణులు వివరిస్తాయి. ఈ ఏడాదిలో అన్నక్యాంటీన్లు, పింఛన్ పెంపు, కుటుంబంలో చదువుకునే పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తదితర పథకాల అమలు ప్రజలకు వివరిస్తారు. అరాచక వైసీపీ పాలన.. కూటమి సుపరిపాలనకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాలని చంద్రబాబు నేతలను ఆదేశించారు. వైసీపీ పాలనలో ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛ లేదని, ఇప్పుడు ప్రతీఒక్కరూ వారి అభిప్రాయలను తెలియజేసే వాతావరణం కూటమి ప్రభుత్వం కల్పించిందని ప్రజలకు అర్థమయ్యే రీతిలో చెప్పనున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. వీరితో పాటు మార్కెట్ యార్డుల పాలకవర్గాలు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, సర్పంచ్‌లు, వార్డు కౌన్సిలర్లు హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికను నేతలు సిద్ధం చేశారు. కార్యక్రమం అమలుపై ఎంపీ, ఎమ్మెల్యేలకు ఆదివారం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర స్థాయిలో అమలవుతున్న ప్రగతితో పాటు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఏడాదిలో చేపట్టిన పనులు, ప్రతి ఇంటికి అందిన సంక్షేమాన్ని తెలియజేసేలా రూపొందించిన రెండు రకాల కరపత్రాలను ప్రజలకు అందజేయనున్నారు. అదేవిధంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నమోదు చేసుకుని పరిష్కరించే దిశగా సమాయత్తమవుతున్నారు. దాదాపు నెల రోజులు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని గ్రామాలు, పట్టణాల్లో ఈ కార్యక్రమంతో ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకం కానున్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకుందాం

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు

గుంటూరు విద్య, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకునేందుకు ఉపాధ్యాయులు బడి ఈడు పిల్లలందరినీ చేర్పించేలా సహకరించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. ఆదివారం బ్రాడీపేట లోని యూటీఎఫ్ హాల్లో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో నైతిక, రాజ్యాంగ విలువలు కాపాడాలంటే.. ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కావాలని కోరారు. ఇందుకు ఉపాధ్యాయులే ప్రత్యేక కృషిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ బడి పట్ల సమాజానికి, తల్లిదండ్రులకి నమ్మకం కలిగించే విధంగా ఉపాధ్యాయుల తమ పని కల్చర్ ని అభివృద్ధి చేసుకోవాలని కోరారు. రాష్ట్ర సహాధ్యక్షుడు ఏఎస్ కుసుమ కుమారి మాట్లాడుతూ బదిలీల చట్టం ద్వారా జరిగిన బదిలీలు, ప్రమోషన్లలో ఉన్న అసంబద్ధాలను సరిజేయడాని యూటీఎఫ్ కృషి చేసిందని తెలిపారు. బదిలీలు ప్రమోషన్లలో క్యాడర్ స్ట్రెంత్, పొజిషన్ ఐడీలు, డీడీఓ కోడ్స్ త్వరితగతిన పూర్తి చేసి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ 12వ పీఆర్సీని వెంటనే అమలు చేయాలన్నారు. యూటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్, ఎం. కళాధర్, సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, వై.నాగమణి కోశాధికారి గయా సుదొల, కార్యదర్శులు పాల్గొన్నారు.



న్యూ పిడుగురాళ్ల రైల్వేస్టేషన్

రైళ్లను ఆపి.. దోపిడీ

- న్యూ పిడుగురాళ్ల స్టేషన్ సమీపంలో దొంగల హల్‌చల్
- బోగీల్లోకి చొరబడి.. ప్రయాణికుల నుంచి బంగారం అపహరణ
- సిగ్నల్ వ్యవస్థ ట్యాంపరింగ్.. ఈ వారంలో మూడు ఘటనలు

పిడుగురాళ్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధా న్యం ఇస్తున్నామన్న రైల్వే అధికారుల ప్రకటనలు డొల్లని గుంటూరు డివిజన్ పరిధిలో వరుసగా చోటుచేసుకుంటున్న ఘటనలు తెలియజేస్తున్నాయి. ఈ వారంలో పిడుగురాళ్ల సెక్షన్‌లో మూడు ఘటనలు చోటుచేసుకున్నాయి. అర్ధరాత్రి వేళల్లో ఈ మార్గంలో రైళ్లను నిలిపేసి దొంగలు బోగీల్లోకి ప్రవేశించి ప్రయాణికులను బెదిరించి బంగారు నగలను దోచుకుంటున్నారు. న్యూ పిడుగురాళ్ల - తుమ్మలచెరువు మధ్య అర్ధరాత్రి తర్వాత ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. నడికూడి - న్యూ పిడుగురాళ్ల రైల్వేస్టేషన్లకు జిల్లా కేంద్రం నుంచి దూరం ఎక్కువగా ఉండటం, ఘటన ఏదైనా జరిగితే అదనపు బలగాలు వచ్చేందుకు సమయం పడుతుండటంతో ఈ ప్రాంతంలోనే ఎక్కువగా దొంగలు దోపిడీలకు పాల్పడుతున్నారని సమాచారం. శనివారం తెల్లవారుజామున విశాఖపట్నం నుంచి చర్లపల్లి వెళ్లే ప్రత్యేక రైలును న్యూపిడుగురాళ్ల రైల్వేస్టేషన్ సమీపంలో సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి ఆపేశారు. దీంతో 4.15 నుంచి 5.30 గంటల వరకు రైలు నిలిచిపోగా అప్పటికే అక్కడ కాచుకుని ఉన్న దుండగులు బోగీలోకి ప్రవేశించి ఇద్దరు మహిళల మెడల్లోని 50 గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించారు. అదేవిధంగా ఆదివారం తెల్లవారుజామున భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు 3.30 గంటల సమయంలో తుమ్మలచెరువు రైల్వేస్టేషన్ చేరుకునే సమయంలో నిలిచిపోయింది. అప్పటికే రైలులో ప్రయాణిస్తున్న దుండగులు ఎస్-1 బోగీలో ప్రవేశించి మహిళలను బెదిరించారు. వారు కేకలు వేయడంతో పక్క బోగీలోని తెనాలి రైల్వే ఎస్ఐ వెంకటాద్రి, కాని స్టేబుళ్లు శేషయ్య, సురేంద్రలు చేరుకున్నారు. దుండగులను గుర్తించిన ఎస్ఐ గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరపడంతో వారు అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారివైపు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న రైల్వే డీఎస్పీలు (మిగతా 6వ పేజీలో)



శోభాయాత్రలో సుభద్ర అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువెళుతున్న మహిళలు

శోభాయాత్ర శోభాయమానం

సుభద్ర అమ్మవారికి సారె సమర్పణ

తాడేపల్లి టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పూరీ జగన్నాధుని రథయాత్ర సందర్భంగా ఆదివారం తాడేపల్లిలో శోభాయాత్ర నిర్వహించారు. ఇస్కాన్ విజయవాడ ఆధ్వర్యంలో దేశంలోనే మొదటి సారిగా సుభద్ర అమ్మవారికి సారె సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు సుభద్ర అమ్మవారిని వివిధ రకాల పూలు, నూతన వస్త్రాలు, సారెలతో సీతానగరం శ్రీమద్విరాంజనేయస్వామి ఆలయం నుంచి శోభాయాత్ర చేపట్టారు. ప్రకాశం బ్యారేజి మీదగా విజయవాడ సీతమ్మపాదాల వరకు ఈ శోభాయాత్ర నిర్వహించారు. పాశ్చాత్య దేశ భక్తబృందం, యువతులు కోలాటాలు, నృత్యాలతో అలరించారు. అనంతరం విజయవాడలో సుభద్ర అమ్మవారికి సారె సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఇస్కాన్ మందిర అధ్యక్షులు శ్రీమాన్ చక్రధరీ దాస్ తదితరులు పర్యవేక్షించారు.



అమ్మవారి వేషధారణలో యువతులు

శ్రీరంగపురం చానల్ మురుగుమయం

పొన్నూరులో ఆక్రమణలతో దెబ్బతిన్న చానల్

పొన్నూరుటౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సాగు, తాగునీరు అందించే శ్రీరంగపురం ఛానల్ మురుగుతో నిండిపోయింది. పొన్నూరులో ఈ కాల్వ మురుగుకాల్వలా మారింది. మండల పరిధిలోని చింతలపూడి, కసక్రరు, ములుకుదురు గ్రామాల పరిధిలో సుమారు 2 వేల ఎకరాలకు ఈ ఛానల్ పరిధిలో పంటలు సాగువుతున్నాయి. చేబ్రోలు మండంలో కొమ్మమూరు కాల్వ నుంచి సుమారు 20 కిలోమీటర్లు ప్రయాణించి మార్గమధ్యలోని గ్రామాలకు, పొన్నూరు పట్టణవాసులకు తాగునీటితో పాటు పంట భూములకు సాగు నీరు అందిస్తుంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న శ్రీరంగపురం ఛానల్ రెండు కిలోమీటర్ల పరిధిలో పట్టణం నడిమధ్యన ప్రవహిస్తుంది. పట్టణం నుంచి ప్రవహించడమే ఈ కాల్వకు శాపంగా మారింది. కాల్వ కట్టలకు ఇరువైపులా ఆక్రమించి పేదలు ఇళ్లు నిర్మించుకున్నారు. సాగు నీటి అధికారుల నిర్లక్ష్యంతో కాల్వ పూడికపోయింది. దీంతో ఎక్కడికక్కడ నీటి ప్రవాహానికి అడ్డంకులు ఎర్పడ్డాయి. సమీప నివాసాల నుంచి వచ్చే మురుగునీరు, వ్యర్థాలు, చెత్తచెదారాలతో కాల్వ నిండా పూడిక చేరింది. దీంతో దిగువ గ్రామాలైన చింతలపూడి, ములుకుదురు, కసుకరు గ్రామాలకు సాగు నీరు అందని పరిస్థితులు ఏర్పడ్డాయి.



విద్యానగర్ వద్ద పూడుకుపోయిన శ్రీరంగపురం చానల్

భద్ర బైకులు.. శిథిలం

తుళ్లూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): భద్ర బైకులు శిథిలం కాగా.. జీపులు తరచూ మొరాయిస్తుండటంతో పోలీసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాజధాని అమరావతిలో కీలకమైన తుళ్లూరు పోలీసులకు వాహన ఇక్కట్లు తప్పడంలేదు. గతంలో ప్రభుత్వం పోలీసులు అత్యవసరంగా స్పందించేందుకు తుళ్లూరు స్టేషన్‌కు మూడు భద్ర బైకులు కేటాయించింది. అయితే ఆ బైకులు మరమ్మతులతో గత కొన్ని నెలలుగా మూలకు చేరాయి. మరమ్మతులు చేసి వినియోగించునే అవకాశం ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో అవి తుప్పు పడుతున్నాయి. స్టేషన్‌లో మూడు జీపులు ఉండగా వాటిలో రెండు జీపులు తరచూ మొరాయిస్తుంటాయి. దీంతో ఏదైనా సంఘటన జరిగినప్పుడు, వీఐపీలు, వీవీఐపీల పర్యటనల సమయంలో తుళ్లూరు పోలీసులకు సరైన వాహనాలు అందుబాటులో ఉండటంలేదు. అంతేకాక సిబ్బంది కొరత కూడా వేధిస్తుంది. 150 నుంచి 200 మంది ఉండాల్సిన రాజధాని స్టేషన్‌లో కేవలం 42 మంది మాత్రమే ఉన్నారు.



రిపేర్లు రావటంతో బయట చెట్ల కింద పెట్టిన భద్ర బైకులు

మరమ్మతులు చేయిస్తాం... : సీఐ శ్రీనివాసరావు

తాను బాధ్యతలు చేపట్టే నాటికే బైకులు మరమ్మతుల్లో ఉన్నాయి. వాటికి త్వరలో మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.



యూజ్ కేసులకు పరిష్కారం కనుగొనడంలో ప్రతిభ చూపిన టీంకు విన్నర్ బహుమతిని అందజేస్తున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

పోలీసు శాఖకు కృత్రిమ మేధని పంచిన హ్యాకథాన్

- మూడు రోజులు మెదళ్లకు ఐటీ నిపుణుల పని
- పోలీసుల సవాళ్లకు సమాధానాలుగా ఏఐ అప్లికేషన్లు..
- 'ఆర్‌వీఆర్' కళాశాలలో ముగిసిన హ్యాకథాన్

6

గిరిజన ప్రాంతాల్లో వసతులకు ప్రాధాన్యం

- కేంద్ర షెడ్యూల్ కులాల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రాజెక్టు అధికారి రిషబ్ చతుర్వేది

మైనార్టీ జూనియర్ కళాశాలలో ప్రవేశానికి ఆహ్వానం

దేశ ఆర్థిక వృద్ధిలో ఆడిటర్ల పాత్ర కీలకం

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు

గుంటూరు(తూర్పు), జూన్ 29(ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక వృద్ధిలో ఆడిటర్ల పాత్ర కీలకమని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. గుంటూరులోని గొట్టిపాటి కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్, కన్సల్టెన్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వానికి, వ్యాపారులకు వారధిగా పనిచేస్తూ.. దేశానికి ఆదాయం సమకూరుస్తున్న ఆడిటర్ల సేవలు ప్రశంసనీయమన్నారు. ఆడిటర్ల సమర్థత, వ్యాపారుల ఖచ్చితత్వంతో జీఎస్టీ వసూళ్లు ఏటా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. జీఎస్టీ పోర్టల్‌లో ఎదురవుతున్న సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కరించేలా కృషి చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. మరో అతిథి తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర పరిధిలో వ్యాపారులు, ఆడిటర్లు ఎదుర్కొనే సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. సభకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దామచర్ల శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, కార్యదర్శి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, కోశాధికారి రాముడు, ఆది నారాయణరెడ్డి, రాజు, షరీఫ్ ఖాన్, సునీల్, శివ, నరేష్, తిరుపాల్, మురళీ, సుబ్రహ్మణ్యం, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి



మృతి చెందిన చల్లగిరి నాగరాజు

ప్రత్తిపాడు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో పురుగు మందు తాగిన కౌలు రైతు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన చల్లగిరి నాగరాజు (45) పదేళ్లుగా పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. పలు కారణాలతో సాగులో నష్టం ఏర్పడడంతో పాటు.. ఇంటి నిర్మాణానికి తెచ్చిన అప్పు పెరిగి రూ.20 లక్షలు అయ్యింది. అప్పు తీర్చే మార్గం కానరాకపోవడంతో.. ప్రత్తిపాడులోని ఇటుకల బట్టీ వద్ద ఈ నెల 25న పురుగుల మందు తాగాడు. వాంతులు చేసుకుంటున్న నాగరాజును గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు గుంటూరు జీజీహెచ్‌లో అతనిని చేర్పించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు.. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు శాఖకు కృత్రిమ మేధని పంచిన హ్యాకథాన్

● మూడు రోజులు మెదళ్లకు ఐటీ నిపుణుల పని
● పోలీసుల సవాళ్లకు సమాధానాలుగా ఏఐ అప్లికేషన్లు..
● 'ఆర్‌వీఆర్' కళాశాలలో ఘనంగా ముగిసిన హ్యాకథాన్

గుంటూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సాంప్రదాయ పోలీసింగ్‌కు అలవాటుపడిన పోలీసు శాఖ కృత్రిమ మేధని వినియోగించి వేగవంతంగా ప్రజలకు సేవలందించేందుకు సిద్ధమైంది. ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) ఫర్ ఏపీ పోలీసు పేరుతో మూడు రోజుల పాటు చౌడవరంలోని ఆర్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాతీయ స్థాయి హ్యాకథాన్ ఆ శాఖకు విధుల్లో సాంకేతికంగా సహాయ పడేందుకు గట్టి నమ్మకాన్ని పెంపొందించింది. పోలీసు శాఖ ఎదుర్కొంటున్న ఎనిమిది రకాల సవాళ్లపై వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఐటీ రంగ నిపుణులు ఏఐని వినియోగించి అప్లికేషన్స్‌ని అభివృద్ధి చేసేందుకు శ్రమించారు. 36 గంటల పాటు తమ మెదళ్లకు పని చెప్పారు. కొందరైతే రాత్రిళ్లు కూడా విశ్రమించకుండా అప్లికేషన్ డెవలప్‌మెంట్‌లో నిమగ్నమయ్యారు. ఆదివారం సాయంత్రం హ్యాకథాన్ ముగింపు సమయానికి తాము డెవలప్ చేసిన అప్లికేషన్స్‌పై ప్రజంటేషన్స్ ఇచ్చారు. వాటిల్లో ఉత్తమమైన వాటికి రూ.75 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.50 వేల నగదు బహుమతులు పోలీసుశాఖ ఉన్నతాధికారులు అందజేసి ప్రోత్సహించారు.



హ్యాకథాన్ ముగింపు కార్యక్రమానికి హాజరైన పోలీసు అధికారులు, ఐటీ రంగ నిపుణులు

దేశంలోనే ప్రప్రథమంగా..

భవిష్యత్తుని ఏఐ శాసించనుండటంతో దీనిని ముందుగానే పసిగట్టిన సీఎం చంద్రబాబు నాయుడు ఇదే అంశాన్ని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు వివరించారు. పోలిసింగ్‌లో ఏఐ వినియోగంపై ఆలోచన చేయాలని సూచించారు. ఈ మేరకు మూడు నెలల క్రితం పోలీసు ఉన్నతాధికారులు ఆలోచనల్లో నుంచి పుట్టిందే ఈ హ్యాకథాన్. దేశంలోనే ప్రప్రథమంగా దీనిని నిర్వహించారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం కూడా సహకారం అందించింది. హ్యాకథాన్ ముగిసినప్పటికీ ఇది సుదీర్ఘ ప్రయాణానికి ఒక నాంది అని డీజీపీ పేర్కొన్నారు. ఈ హ్యాకథాన్‌కి 160 బృందాలు నమోదు చేసుకోగా 60 టీంలను షార్టులిస్టు చేశారు. రిజిస్ట్రేషన్ టెస్టుమెంట్‌ని ముగించిన తర్వాత కూడా అదనంగా మరో 40 అభ్యర్థనలు పోలీసు శాఖకు అందాయి. ఈ హ్యాకథాన్ విజయవంతం కావడానికి ఆర్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం అందించిన సహకారం మరువలేనిది. ఎలాంటి ఏర్పాట్లు కావాలంటే వాటిని చకచకా చేశారు. మూడు నెలల వ్యవధిలోనే టెక్నాలజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పరంగా అన్నింటిని కల్పించారు.

పూర్తి సహకారం

యూజ్ కేసులకు ఐపీఎస్ అధికారులు రాజకుమారి, ఫకీరప్ప, మల్లికగార్గ్, వకుల్, తుషార్, కిషోర్ మెంటార్లుగా వ్యవహరించారు. వీళ్లందరిని ఐటీ బ్యాక్‌గ్రౌండ్ ఉండడంతో పోలీసు శాఖ ఎంపిక చేసింది. పయోనీరింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ లా అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ గవర్నెన్స్ టా స్కు ఫోర్సు, స్థానిక పోలీసులు నిరంతరాయంగా హ్యాకథాన్ నిర్వహణకు సహకారం అందించారు. ఐటీ ఇన్‌స్పెక్టర్లు, లాజిస్టిక్స్ సపోర్టు టీం 24 గంటలు పని చేసి బృందాలకు పరికరాలను సమకూర్చి, డేటాని భద్రపరిచి షెడ్యూల్ ప్రకారం హ్యాకథాన్ జరిగేలా చేసింది. జెన్ ఏఐ, ఏజెం టిక్ ఏఐలను ఇంకా ఐటీ సంస్థలు పూర్తిస్థాయిలో స్వీకరించ లేదు. చాలామందికి ఈ పదాలు కూడా తెలియవు. అయినప్పటికీ పోలీసు శాఖ ఇందులో చూపించిన చొరవ సీఎం దార్శనికత, ఐజీ శ్రీకాంత్ నాయకత్వం, ఐపీఎస్, ఆవిష్కర్తల నిబద్ధత నుంచి వచ్చిందని డీజీపీతో పాటు ఇతర అధికారులు అన్నారు.



ఏపీ పోలీసుశాఖకు నాలెడ్జ్ పార్టనర్‌గా ఉంటూ హ్యాకథాన్ నిర్వహణకు సహకరించిన ఫోర్ సైట్ ఏఐ సంస్థ సీఈవో కోతా సూర్యకు మెమెంటోని అందజేస్తున్న డీజీపీ హరీష్‌గుమార్ గుప్తా

ఎనిమిది యూజ్ కేసుల విజేతలు, రన్నరప్‌లు

పిటీషన్ మేనేజ్‌మెంట్ సిస్టం యూజ్ కేసుకు మెంటార్‌గా వకుల్ జిందాల్ వ్యవహరించగా ఇందులో కంట్రోల్డ్ ఫ్రీక్స్ విజేతగా, పారాబోలా 9 రన్నరప్‌గా నిలిచాయి. సీసీటీఎన్ఎస్ కోపైలట్ ఇంజిన్ యూజ్ కేసుకు మెంటార్‌గా తుషార్ డూడీ వ్యవహరించగా క్యాలీరెక్స్ 1, బ్లూ క్వైరీ 2, ఇన్వెస్టిగేషన్ ఆఫ్ ఐటీ కేసెస్ - 91 సీఆర్‌పీసీ యూజ్ కేసు కు మెంటార్‌గా డాక్టర్ ఫకీరప్ప వ్యవహరించారు. ఎక్స్‌ప్లోర్మిటి, క్వాంటం మావేరిక్స్. సీడీఆర్/ఐపీడీఆర్ కోపైలట్ ఇంజిన్ యూజ్ కేసుకు ఏలూరు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ మెంటార్‌గా.. వ్యవహరించగా ఏఐ జంట్స్, పారాబోలా 9 విజేత, రన్నరప్‌గా నిలిచాయి. డయల్ 112 ఎనలైజర్ యూజ్ కేసుకు మెంటార్‌గా మల్లిక గార్గ్, విజేతగా ఓల్ ఏఏ, రన్నరప్‌గా ఇన్ఫికోడ్ కప్స్.. డిజిటల్ సర్వీసు రికార్డులు యూజ్ కేసుకు బి.రాజకు మారి మెంటార్ కాగా.. విజేతగా ట్రిపుల్ డీ, రన్నరప్ గా ఏఐ లుమినాటి నిలిచాయి. వాట్సాప్ సమ్మరైజర్ యూజ్ కేసుకు వకుల్ జిందాల్ మెంటార్‌గా వ్యవహ రించగా ప్రగ్యావర్స్ విజేతగా, సర్వ్ స్మార్ట్ రన్నరప్‌గా నిలిచారు. న్యూస్ డైజెస్టు సమ్మరైజర్ యూజ్ కేసుకు మల్లిక గార్గ్ మెంటార్ కాగా.. నేత్ర రక్షక్ విజేతగా, డైనమిక్ స్క్విరెల్స్ రన్నరప్‌గా నిలిచాయి.

విద్యా రంగంలో మార్పులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం

● టీడీపీ తూర్పు, పశ్చిమ ఇన్‌చార్జి తాళ్ల వెంకటేష్ యాదవ్



మాట్లాడుతున్న తాళ్ల వెంకటేష్ యాదవ్

గుంటూరు (విద్య) జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని.. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో కారుణ్య నియామకాలు చేపట్టాలని తెలుగుదేశం పార్టీ తూర్పు, పశ్చిమ ఇన్‌చార్జి తాళ్ల వెంకటేష్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక అమరావతి రోడ్డులోని ఆంజనేయ పేటలో తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వెంకటేష్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో 62,000 మంది ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, బదిలీలు జరిగాయన్నారు. తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం 15 ఏళ్లుగా ఉపాధ్యాయుల సమస్యలపై చిత్తశుద్ధితో కృషి చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సంఘాన్ని విస్తృత పరచి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర కార్యదర్శి మన్నం శ్రీనివాస్ మాట్లాడుతూ జీవో నంబరు 117 రద్దు చేసి.. రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలను అభివృద్ధి చేసిందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర సహాధ్యక్షులు పూర్ణ చంద్రరావు, రాంబాబు, మహిళా కార్యదర్శి పద్మావతి, ఏలూరు అధ్యక్షురాలు శర్వాణి, కార్యదర్శులు వెంకట్రావు, జగదీష్‌కుమార్, రామారావు, ఆంజనేయులు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు బాలస్వామి, కార్యదర్శి జగదీష్‌బాబు, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, సహాధ్యక్షులు శ్రీధర్, ప్రమీల రాణి, టౌన్ అధ్యక్షుడు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా రిజర్వేషన్ కోటాల సవరణ

● రైళ్లలో కొన్ని తరగతుల బెర్తుల పెంపు, కొన్నింటిలో కోత

గుంటూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మీదగా రాకపోకలు సాగించే కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రిజర్వేషన్ కోటాలను రైల్వే శాఖ ఇష్టారాజ్యంగా సవరిస్తోంది. డిమాండ్‌కు అనుగుణంగా కాకుండా ఏవేవో అంశాలను ప్రామాణికంగా తీసుకొని కొన్ని తరగతుల బోగీల్లో బెర్తుల సంఖ్య పెంచి, కొన్నింటిలో కోత విధిస్తోంది. తాజాగా 17232 నాగర్‌సోల్ - నరసపూర్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కి ఫస్టు ఏసీ, ఏసీ టూటైర్, ఏసీ త్రీటైర్, స్లీపర్ క్లాసుల బెర్త్‌లను సవరించింది. దీంతో నాగర్‌సోల్, నాందేడ్, చర్లపల్లి నుంచి గుంటూరుకు ప్రయాణించేందుకు బెర్తుల సంఖ్య పెరిగింది. అయితే తత్కాల్, ప్రీమియం తత్కాల్ టిక్కెట్లు గతంలో కోటా ప్రకారం 32, 31 ఉంటే ఇప్పుడే 132 చొప్పున పెంచింది. వారంలో రెండు రోజులు ప్రయాణించే 17221 కాకినాడ - లోకమాన్య తిలక్ టెర్మినల్ ఎక్స్‌ప్రెస్‌కి ఫస్టు ఏసీ రెండు ఉంటే వాటిని తీసేసింది. ఏసీ టూటైర్‌ను రెండు నుంచి ఆరుకు పెంచింది. ఏసీ త్రీటైర్‌లో 11 నుంచి 20కి పెంచింది. స్లీపర్‌లో 21 నుంచి ఎనిమిదికి కుదించింది. ప్రీమియం తత్కాల్‌లో మాత్రం బెర్తుల సంఖ్య పెంచుకుంది. 17655 కాకినాడ - పుదుచ్చేరి సర్కార్ ఎక్స్‌ప్రెస్‌కి న్యూ గుంటూరులో ఎలాంటి కోటా లేదు. విజయవాడ కోటానే ఆధారం. ఈ రైలుకు స్లీపర్ బెర్తులు గతంలో 51 ఉంటే 74కి పెంచింది. ఇది కొంత మేరకు ప్రయాణికులకు ఉపయోగకరం. 17644 కాకినాడ-చెంగల్‌పట్టు ఎక్స్‌ప్రెస్‌కు విజయవాడ రిమోట్ లోకేషన్‌లో స్లీపర్ బెర్తుల సంఖ్య 51 నుంచి 40కి తగ్గించింది. ఏసీ త్రీటైర్ 18 నుంచి 14కి కుదించింది. ఏసీ టూటైర్‌లో ఉన్న ఒక బెర్త్‌ను తీసేసింది. 17225 నరసపూర్-హుబ్లీ అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలులో గతంలో 24 స్లీపర్ క్లాస్ బెర్తులు గుంటూరు రిమోట్ లోకేషన్‌లో ఉండేవి. ఇప్పుడు వాటిని 12కు తగ్గించారు. ఏసీ త్రీటైర్‌లో కూడా ఆరు నుంచి నాలుగుకి బెర్త్‌లు తగ్గించారు.

మైనార్టీ జూనియర్ కళాశాలలో ప్రవేశానికి ఆహ్వానం

గుంటూరు (విద్య) జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక నంది వెలుగు రోడ్డులోని మైనార్టీ రెసిడెన్షియల్ జూని యర్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో 7, బైపీసీలో 19, సీఈసీలో 18 ఖాళీలు ఉన్నాయని పేర్కొ న్నారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు సోమవారం సాయంత్రానికి దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అమరావతి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గేదెలను ఢీకొని ద్విచక్ర వాహ నదారుడు మృతి చెందిన ఘటన ధరణికోటలోని ఆర్‌వీవీఎస్ కళాశాల వద్ద ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు మల్లాది గ్రామానికి చెందిన బుల్లా కుమార్(32) అమరావతి నుంచి స్వగ్రామం మల్లాదికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. కళాశాల సమీపంలో రహదారిపై గేదెలను గుర్తించకుండా ఢీకొట్టడంతో కింద పడి అక్క డికక్కడే మృతి చెందాడు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	101, 109, 120
చికెన్ విత్ స్కిన్(కిలో)	194.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	204.00

గిరిజన ప్రాంతాల్లో వసతులకు ప్రాధాన్యం

15వ తేదీలోగా అందరికీ ఆయుష్మాన్ కార్డుల పంపిణీ

కేంద్ర షెడ్యూల్ కులాల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రాజెక్టు అధికారి రిషబ్ చతుర్వేది

బొల్లాపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కేంద్ర షెడ్యూల్ కులాల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రాజెక్టు అధికారి రిషబ్ చతుర్వేది తెలిపారు. మండలంలోని హనుమాపురం శివారు పాపాయ పాలెం గ్రామంలో గిరిజనులు, చెంచులు నివాస ప్రాంతాల్లో దర్తి అబ జనభాగిదారి అభియాన్ పథకంలో భాగంగా ఆదివారం ఆయన సందర్శించారు. తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామన్నారు. వెల్లటూరు చెంచుకాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. అనంతరం ఆయు ష్మాన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఆయుష్మాన్ భారత్ కార్డు ద్వారా దేశంలో ఎక్కడైనా రూ.5 లక్షల వరకు ఉచిత ఆరోగ్య సేవలు అందుతాయన్నారు. జూలై 15 లోగా అందరికీ ఆయుష్మాన్ కార్డులను పంపిణీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామయ్య, సర్పంచ్ పీపాల సాయిబాబ, హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు, ఏపీవో వాసుబాబు, ఐటీడీఏ సురేష్, ఎంఈవో కంచర్ల పార్వతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మస్తాన్‌బీ పాల్గొన్నారు.



దర్తి అబ జనభాగిదారి అభియాన్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రిషబ్ చతుర్వేది, అధికారులు

బర్లీకి.. బొనంజా

(5వ పేజీ తరువాయి)

ప్రతినిధులను పంపి రాయబేరాలు చేస్తున్నాయి. కొనుగోళ్లు చేయాలని ప్రభుత్వం ఆదేశిస్తే.. అంతర్జాతీయ మార్కెట్ లెక్కలను వల్లెవేయడంతో పాటు ఇష్టం వచ్చినట్లు సాగు చేశారన్న తప్పును రైతులపై కంపెనీలు వేశాయి. చివరకు ప్రభుత్వం ఈ నెల 19 నుంచి మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేపట్టింది. బాపట్ల జిల్లాతో పాటు గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మార్క్‌ఫెడ్ రంగంలోకి దిగగానే పొగాకు కంపెనీలు ధరపై స్వరం మార్చాయి. తాము కూడా అదే ధరకు కొనుగోలు చేస్తామంటూ ముందుకు వచ్చాయి. బర్లీకి డిమాండే లేదని నిన్నమొన్నటి వరకు చెబుతూ వచ్చిన కంపెనీలు ఇప్పుడు మాటమార్చడం గమనార్హం. ఓ వైపు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు ఇప్పుడిప్పుడే గాడిన పడుతున్న తరుణంలో కారణాలు ఏవైనా కానీ కంపెనీలలో కూడా కదలిక రావడాన్ని బర్లీ రైతులతో పాటు ప్రభుత్వం కూడా స్వాగతిస్తోంది.

3,100 క్వింటాళ్లు కొన్న మార్క్‌ఫెడ్..

బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల పరిధిలో ఏడు కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ తెరిచిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు ఆయా కేంద్రాల నుంచి 3,100 క్వింటాళ్ల వరకు పొగాకు సేకరించింది. ఈ క్రాప్‌లో అనేక సాంకేతిక సమస్యలు తలెత్తాయి. వాటన్నింటిని తొలగించడానికి కసరత్తు చేసిన యంత్రాంగం వాటిని ఓ కొలిక్కి తెచ్చి దాదాపు 13,000 ఎకరాల్లో పొగాకును అదనంగా కొనేందుకు మార్గం సుగమం చేసింది. ఇప్పటికే నాలుగు జిల్లాల పరిధిలో ఏడు కొనుగోలు కేంద్రాలు నడుస్తుండగా మరో 12 కేంద్రాలను అదనంగా తెరవడానికి మార్క్‌ఫెడ్ సన్నాహాలు చేస్తోంది. ఈ పరిణామాలతో కంపెనీలు కూడా పెద్దఎత్తున పొగాకు కొనుగోలు చేపట్టినట్లు సమాచారం. పైగా గ్రేడ్లతో సంబంధం లేకుండా సగటున రూ.8,000 నుంచి రూ.9,000 వరకు క్వింటాకు ధర ఇవ్వడానికి కొన్ని కంపెనీలు ముందుకు రావడం గమనించదగ్గ అంశం. బర్లీ పొగాకు సాగులో నెలకొన్న పరిణామాలతో క్రాప్ హాలిడే ప్రకటించింది. పైగా ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయశాఖ ద్వారా రైతులను ప్రోత్సహిస్తోంది. ఈ క్రమంలో ఈ ఏడాది పొగకు పంట ఉండదన్న సంకేతాలతో కంపెనీలను పునరాలోచనలో పడ్డాయని దీంతోనే కొనుగోళ్లకు రంగంలోకి దిగాయని తెలుస్తోంది.

రైళ్లను ఆపి.. దోపిడీ

(5వ పేజీ తరువాయి)

అక్కేశ్వరరావు, శైలేష్‌కుమార్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కాల్పులు జరిపేందుకు వెనుకాడం

రైళ్లలో దొంగతనాలకు ప్రయత్నించినా, చేసినా వారిపై కాల్పులు జరిపేందుకు కూడా వెనుకాడమని రైల్వే డీఎస్పీలు అక్కేశ్వరరావు, శైలేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. వారం వ్యవధిలో జరిగిన మూడు ఘటనలపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. దోపిడీ ముఠాలు బీహార్, మహారాష్ట్రకు చెందినవిగా అనుమానిస్తున్నామన్నారు. సమావే శంలో రైల్వే ఎస్ఐలు హుస్సేన్, అంజిబాబు, మోహన్ పాల్గొన్నారు.

మహా వారాహిదేవిగా బగళాముఖి



వారాహిదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

పిట్టలవానిపాలెం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు ఘ నంగా జరుగుతున్నాయి. నాలుగవ రోజు ఆదివారం అమ్మవారిని మహా వారాహిదేవిగా అలంకరించినట్లు ఆలయ ఈవో జి.నరసింహమూర్తి తెలిపారు. రాష్ట్రం సస్యశ్యామలం కావాలని, భక్తజనులకు సంతోష జీవనాన్ని అనుగ్రహించాలని అమ్మవారిని కోరినట్లు ఈఓ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మహంకాళికి నిమ్మకాయల అలంకరణ



నిమ్మకాయల దండల అలంకరణలో మహంకాళి అమ్మవారు

దుగ్గిరాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కంఠంరాజు కొండూరు గ్రామంలోని మహంకాళీ అమ్మవారి ఆలయం ఆషాఢ మాసం తొలి ఆదివారం భక్తుల తో కళకళలాడింది. పంచమి తిథి పురస్కరించుకుని అమ్మవారికి 2 వేల నిమ్మకాయలు కూర్చిన దండల అలంకరణ కనువిందు చేసింది. అమ్మవారి ప్రాంగణాన్ని 23 రకాల పు ష్పాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. భక్తులు తెల్లవారు జామునుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయ గాలిగోపురం నుంచి క్యూ కట్టారు. రెండో ఆదివారం అమ్మ వారు గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని ఈఓ సునీల్‌కుమార్, వ్యవస్థాపక ధర్మకర్త దేవాభక్తుని రంగ ప్రసాద్ తెలిపారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



ప్రమాణ స్వీకారం చేస్తున్న జయకుమార్ తదితరులు

వ్యాపారవర్గాల ఉన్నతికి ప్రభుత్వం చేయూత

● ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు భాస్కరరావు

గుంటూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యాపార వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం చేయూతనిస్తుందని ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పొట్లూరు భాస్కర రావు అన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ ప్లాస్టిక్ మ్యానుఫ్యాక్చరర్ అసోసియేషన్ నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన గుడివాడ జయకుమార్, కార్యదర్శిగా ఎం.కోటేశ్వరరావు, కోశాధికారిగా వైబీ శివారెడ్డిల ప్రమాణ స్వీకార కార్యక్రమం పలకలూరు రోడ్డులోని గుంటూరు క్లబ్‌లో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన భాస్కరరావు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించి మాట్లాడారు. అసోసియేషన్ అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో ఔత్సాహిక వ్యాపారవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. నూతన రాష్ట్ర అధ్యక్షుడు గుడివాడ జయకుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. భవిష్యత్తులో అసోసియేషన్ తరపున నూతన భవంతిని నిర్మించి నిరుద్యోగ యువతకు ప్లాస్టిక్ టెక్నాలజీలో మెలకువలను నేర్పించడంతో పాటు ఉచిత శిక్షణ తరగతులు ఇప్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. పలువురు వ్యాపారులు నూతన కార్యవర్గానికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

అంతర్జాతీయ చెస్ పోటీలకు గుంటూరు క్రీడాకారిణి



కోచ్ రవీంద్రరాజుతో చదరంగం ఆడుతున్న నిహారిక

గుంటూరు (తూర్పు), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఫ్రాన్స్ దేశంలో జులై 5 నుంచి జరిగే అంతర్జాతీయ చెస్ పోటీల్లో గుంటూరుకు చెందిన చల్లా నిహారిక పాల్గొంటున్నట్టు కోచ్ రవీంద్రరాజు తెలిపారు. స్థానిక చంద్రమౌళినగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 50కు పైగా జాతీయస్థాయి, 30పైగా అంతర్జాతీయ చెస్ పోటీల్లో ఆమె పాల్గొని అత్యున్నత ప్రతిభ కనబరిచారని తెలిపారు. ముఖ్యంగా 2025లో అహ్మదా బాద్‌లో జరిగిన జాతీయ మహిళా చదరంగపు పోటీల్లో నిహారిక తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం నిహారిక ఫిడే రేటింగ్ 2072లో స్థానంలో ఉన్నా రని పేర్కొన్నారు. త్వరలో జరిగే అంతర్జాతీయ పోటీల్లో మంచి ప్రతిభను కనబరిస్తే ఆమె గ్రాండ్ మాస్టర్‌కు చేరుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన నిహారికను జీనియస్ చెస్ అకాడమీ నిర్వాహకులు, కోచ్‌లు తదితరు లు ప్రత్యేకంగా అభినందించారు.

సమస్యల పరిష్కారానికి ఏకతాటిపైకి రావాలి

● గౌడ సంఘీయుల ఆత్మీయ సమావేశంలో నేతలు

గుంటూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సమాజంలో నానాటికి ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక, రాజకీయ సమస్యల పరిష్కారం కోసం గౌడ సంఘీయులంతా ఏకతాటిపైకి రావాలని గౌడసంఘం నాయకు లు ఈడే అశోక్‌కుమార్, చాలపాటి వెంకటేశ్వరరావులు పిలుపునిచ్చా రు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన గౌడ సంఘీయులతో ఆదివారం నెహ్రూనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల వారీగా తమను గీత, గౌడ, శెట్టిబలిజ, ఈడిగా, శ్రీశయన, యాత అనే వివిధ పేర్లతో తమ సామాజిక వర్గాన్ని అభివర్ణిస్తున్నారన్నారు. అయినప్పటికీ తమ జీవన స్థితిగతులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు ఆర్థికంగా, రాజకీయం గా, సామాజికంగా అభివృద్ధి సాధించాలంటే కూటమి ప్రభుత్వం గౌడ సంఘీయులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. నామినేటెడ్ పదవుల్లో నూ ప్రాధాన్యం కల్పించి తమ సామాజికవర్గ అభివృద్ధికి దోహదపడా లని కోరారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దలతో చర్చించి గ్రామస్థా యి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి నూతన సంఘ నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో శ్రీశయన రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ అప్పారావు, తులసీరామ్ (తిరుపతి), డీ కుమారస్వామి (చిత్తూరు), జీ బాబ్జి శెట్టిబలిజ, గోపాల్ ఈడిగ, పట్టా రాంబాబు (కాకినాడ), ఎం శ్రీహరిరాణి, చిట్టి బొమ్మల కిషోర్, అంగటి రాము, దాసరి ప్రసాద్ (రావులపాలెం), రావుల మణి, వంశీ, దొంతా సురేష్, అద్దంకి వేణుగోపాలరావు, రామకృష్ణ, రామ్‌శంకర్ తదితరులున్నారు.



సంఘీభావం తెలియజేస్తున్న గౌడసంఘం నాయకులు

ఆరోగ్యకార్డులపై వైద్యానికి హాస్పటల్స్ నిరాకరణతో..

సొంత వైద్యానికి అలవాటు పడుతున్న పెన్షనర్లు

● ఈదర వీరయ్య

గుంటూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు ప్రభుత్వం ఇచ్చిన ఆరోగ్య కార్డులపై వైద్యం చేయటానికి ఆస్పత్రుల యాజమాన్యాలు నిరాకరిస్తుండటంతో ప్రమాదమని తెలిసినా సొంత వైద్యానికి అలవాటుపడుతున్నారని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఆరోగ్యశాఖ కార్యదర్శికి రాసిన ఒక లేఖలో పేర్కొన్నారు. సొంత వైద్యం ఆరోగ్యానికి చేటుచేస్తుందని 52 శాతం పైగా భారతీయులు వైద్యుల ప్రమేయం లేకుండా తమంతట తామే మందులు వేసుకుంటున్నారని ప్రపంచ ఆరోగ్య సర్వేలో తేలిందని తెలిపారు. సొంత వైద్యం ద్వారా తరచూ ఆరోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నారని, అనవసరంగా యాంటిబయోటిక్ వాడుతున్నారని ఆ నివేదిక వెల్లడించిందన్నారు. ఇది చాలా ప్రమాదకరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలో 3వేల వరకు ఔషధ దుకాణాలున్నాయని, నెలకు రూ.3 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందని తెలిపారు. ఇందులో 30శాతం పైగా సొంత వైద్యం ద్వారానే ఔషధాలు అమ్ముడవుతున్నట్లు అంచనా. దీనిని బట్టి చూస్తేనే సొంత వైద్యంపై ఎంత మంది ఆధారపడుతున్నారో అర్థమవుతుంది. తామే ఆరోగ్య నిపుణులమనుకుంటూ, ఇతరులకు వైద్య సలహాలు ఇస్తూ ఏకంగా మందులే సిఫార్సు చేస్తుంటారు. ఈ తతంగం అంతా చూడటానికి బాగానే ఉన్నా, ఆరోగ్యంపై మాత్రం తప్పకుండా ప్రభావం చూపుతుంది. తమతోపాటు ఇతరులకు నష్టం చేసినవారవుతారు. అనవసరంగా యాంటిబయోటిక్స్ వాడటం మానవుని శరీరానికి చాలా ప్రమాదకరమని తెలిపారు. అతిగా ఉపయోగించటం వల్ల శరీరం అలవాటు పడుతుందన్నారు. ఇలా జరిగితే మామూలు జ్వరం వచ్చినా తగ్గదన్నారు. యాంటిబయోటిక్స్‌ను శరీరానికి అలవాటు చేస్తే డోస్‌ను క్రమేపి పెంచుకుంటూ పోవాల్సి వస్తుంది. ఇది మానవుడి శరీరానికి చాలా హానికరం అని అన్నారు. ఈ నిబంధనలను అటు రోగులు, ఇటు మందుల దుకాణాలవారు పాటించటం లేదన్నారు. ఒక్క మూత్ర పిండం ఉన్న వారు, మూత్ర పిండాలు పాడైనవారు వీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. అలానే చిన్న పిల్లలకు కూడా అనవసరంగా యాంటీ బయోటిక్స్ ఇవ్వకూడదన్నారు. ఆరోగ్యశాఖ కార్యదర్శి చర్యలు తీసుకొని ప్రభుత్వం ఇచ్చిన ఆరోగ్య కార్డులపై ఆస్పత్రుల యాజమాన్యాలు వైద్యం అందించే విధంగా చూడాలని వీరయ్య కోరారు.

వృక్షాలు ఇలా.. విద్యుత్ అంతరాయాలు తగ్గేదెలా!

● విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో నిర్లక్ష్యం

గుంటూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో సెక్షన్ స్థాయిలో అధికారుల పర్యవేక్షణా లోపం, కింది స్థాయి ఆపరేషన్ సిబ్బంది నిర్లక్ష్యం వెరసి ప్రజలకు శాపంగా పరిణమిస్తోంది. క్షేత్ర స్థాయిలో పోల్స్, విద్యుత్ లైన్‌ల నిర్వహణ సరిగా లేకపోవటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు నానాటికి పెరుగుతూనే ఉన్నాయన్న విమర్శలు ఉన్నాయి. నిరంతరాయ విద్యుత్ సరఫరా అందిస్తామంటూ అధికారులు పదేపదే చేస్తున్న ప్రకటనలు మాటలకే పరిమితమవుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యుత్ సరఫరాలో ఎక్కడా సాంకేతిక అంతరాయాలు లేకుండా చూసేందుకు ప్రతి నెల రెండో శనివారం విద్యుత్‌లైన్‌ల నిర్వహణ పేరుతో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. అది చాలదన్నట్టు సాధారణ రోజుల్లో కూడా విద్యుత్ సరఫరా నిలిపివేసి విద్యుత్ లైన్‌ల నిర్వహణ కార్యక్రమాలు చేపడుతున్నారు. అయినప్పటికీ షరా మామూలుగానే నగరంలో పాత గుంటూరు నుంచి అమరావతి రోడ్డు, నల్లపాడు రోడ్డు, నల్లచెరువు రోడ్డు వరకు అనేక ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలపై అధికారులకు ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. విద్యుత్ లైన్‌ల నిర్వహణ పేరుతో విద్యుత్ తీగెలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించటం, ఎక్కడా బలహీనంగా తీగెలు ఉన్నా మార్చటం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే సెక్షన్ స్థాయిలో అధికారులు పర్యవేక్షణ లేకపోవటమే విద్యుత్ అంతరాయాలకు ప్రధాన కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో విద్యుత్‌లైన్‌లను పరిశీలించి నిరంతరాయ విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



శ్రీరామ్‌నగర్ మెయిన్ రోడ్డులో విద్యుత్‌పోల్‌కు చుట్టుకుపోయిన పిచ్చిమొక్కలు





ఏటీ అగ్రహారం జీరో లైనులో విద్యుత్ తీగెలపైకి వృక్షాలు



అంకమ్మనగర్ బ్రిడ్జి పక్కన విద్యుత్ పోల్‌కు ఇలా..

నలుగురు వైద్యప్రముఖులకు రేపు సత్కారం

● ఐఎంఏ గుంటూరు నగర శాఖ వెల్లడి

గుంటూరు మెడికల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకొని జూలై ఒకటో తేదీన కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని జీఎంఏ హాల్‌లో జరిగే డాక్టర్స్ డే వేడుకల్లో నలుగురు వైద్య ప్రముఖులను సత్కరిస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు నగరశాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వై సుబ్బారాయుడు, డాక్టర్ బీ సాయికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ వేమూరి రామా తారక్‌నాథ్, ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.విజయ, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఎస్ ఖాదర్‌బాషా, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు, ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ గార్లపాటి నంద కిషోర్‌లను సత్కరిస్తున్నట్లు వారు వెల్లడించారు. రాష్ట్ర వైద్య రంగానికి వారు అందించిన సేవలకు గుర్తింపుగా డాక్టర్స్ డే వేడుకల్లో వీరిని సత్కరిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని జీఎంఏ హాల్లో జరిగే ఈ సత్కార కార్యక్రమానికి ఐఎంఏ సభ్యులు హాజరుకావాలని వారు కోరారు.




మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్, పాల్గొన్న సీపీఐ నాయకులు

సహజ సంపద దోపిడికే ఆపరేషన్ కగార్

● సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

గుంటూరు(తూర్పు), జూన్ 29(ఆంధ్రజ్యోతి): సహజ సంపదను దోచుకునేందుకే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను తీసుకువచ్చిందని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ విమర్శించారు. స్థానిక హనుమాన్‌నగర్‌లో ఆదివారం జరిగిన ఆ పార్టీ శాఖ మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అటవీ సంపదలను కార్పొరేట్‌లకు కట్టబెట్టడమే ఆపరేషన్ కగార్ లక్ష్యమని అన్నారు. మావోయిస్టుల అంతం పేరుతో అక్కడ నివసిస్తున్న గిరిజన ప్రజలను చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ, అమిత్ షా చేస్తున్న కుట్రలపై దేశ ప్రజలను చైతన్య పరచాలని అన్నారు. నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ త్వరలో జరిగే సీపీఐ జాతీయ మహాసభలను విజయవంతం చేసేందుకు శాఖ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 29వ డివిజన్‌ను నూతన శాఖను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రావుల అంజిబాబు, అకిటి అరుణ్‌కుమార్, ఆంజనేయులు, వలీ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వాగ్గేయకార సంకీర్తనం



కీర్తనలను ఆలపిస్తున్న కళాకారులు

గుంటూరు(తూర్పు), జూన్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆదివారం శ్రీ అవధూతేంద్ర భక్త బృందం ఆధ్వర్యంలో వాగ్గేయకార సంకీర్తన కార్యక్రమం జరిగింది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. భగవన్నామస్మరణతో శ్రీహరి శరణ్ మహరాజ్ బృందంచే శ్రీహరి శరణ్ మహరాజ్ బృందంచే పలువురి వాగ్గేయ కీర్తనలు ఆలపించి, కీర్తనల సారాంశాన్ని చక్కగా ప్రవచన రూపంలో వివరించి ప్రేక్షకులను ఆకట్టు కున్నారు. డోలక్‌పై షణ్ముఖశర్మ వాయిద్య సహకారం అందించారు. ఈ సందర్భంగా సంకీర్తన బృందాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.



మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ ఉమాశంకర్

వైద్యశిబిరాలను సద్వినియోగించుకోవాలి

● డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్

గుంటూరు మెడికల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముంగిటకే వచ్చి ఖరీదైన వైద్యసేవలు అందించే ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ ఉద్బోధించారు. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఆళ్లవారిపాలెంలో అహల్యా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో ఆయన ప్రసంగించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ శనక్కాయల రాజకుమారి మాట్లాడుతూ గర్భిణులు సుఖప్రసవం జరిగేంత వరకు వైద్య పర్యవేక్షణలో ఉంటూ తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. అనంతరం జరిగిన వైద్యశిబిరంలో డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, డాక్టర్ రాజకుమారి, డాక్టర్ గౌతమ్, డాక్టర్ ప్రియాంక తదితరులు రోగులకు వైద్యసేవలు అందించారు. ఈ శిబిరంలో 220 మందికి పరీక్షలు జరిపి, ఉచితంగా మందులు అందజేశారు. గోవర్ధనమ్మ, విష్ణుమొలకల రామాయమ్మ జ్ఞాపకార్థం ఈ వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆళ్లవారిపాలెం సర్పంచ్ శ్రీనివాసరావు, అశోక్, వెంకటేశ్, టీఎస్ ప్రసాద్, బీ.సీతారామయ్య, వీబీ రావు, అహల్యా నర్సింగ్ హోమ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోవాలి

● సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్ వలీ

గుంటూరు(తూర్పు), జూన్ 29(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డు కోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్ వలీ పిలుపునిచ్చారు. విద్యుత్ చార్జీల పెంపుదలకు నిరసనగా జూలై 5న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ స్థాని క శ్రీనగర్‌లో జరిగిన ప్రచార ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్మార్ట్ మీటర్లను పగలగొట్టండి అని పిలుపునిచ్చిన నారా లోకేశ్ అధికారంలోకి వచ్చిన తరువాత వాటికి మద్దతు పలకడం హేయమన్నారు. గత ముఖ్యమంత్రి అదానితో పెట్టు కున్న సెకీ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అధిక ఛార్జీలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా 5వ తేదీన విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట జరిగే ధర్నా లో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో రెహమన్, ఇస్మాయిల్, జిలాని, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచార ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ నాయకులు

వనాలు కావవి.. వాటర్ ట్యాంకులు







ఆకాశానికి ఎగబాకుతున్న రావి చెట్టు. గుబురుగా అల్లుకున్న జమ్మి చెట్లు. ఇవన్నీ ఏ అడవి లోనివో అనుకునేరు. గుంటూరు సమీపంలోని అడవి తక్కెళ్లపాడు రాజీవ్ గృహ కల్పలో ఉన్న వాటర్ ట్యాంకుల్లో మొలిచి మానులుగా మారుతున్న చెట్ల ఫొటోలు. పట్టించుకునే నాథుడు లేక అలా తయారయ్యాయి. కొద్ది రోజులు అంతే చూస్తూ ఉంటే చెట్లు పెద్దవి అయ్యి వాటర్ ట్యాంకులు కూలిపోయే ప్రమాదం ఉంది. - గుంటూరు (ఆంధ్రజ్యోతి).



ప్రసంగిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, వేదికపైన లక్ష్మణరెడ్డి తదితరులు

మానవత్వానికి ప్రతీకగా.. మానవత స్వచ్ఛంద సంస్థ

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : మానవత స్వచ్ఛందసేవా సంస్థ మూడు సంవత్సరాలుగా గుంటూరులో బహుముఖ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మానవత్వానికి ప్రతీకగా నిలిచిందని గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం మానవత 3వ వార్షికోత్సవానికి పులి శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. గుంటూరు నగరంలో 5 లక్షల మొక్కలను నాటి హరిత గుంటూరుగా మార్చాలనే సంకల్పంలో మాన వత భాగస్వామ్యం కావాలని కోరారు. మానవత లాంటి స్వచ్ఛంద సంస్థలను కలుపుకుని గుంటూరు నగరాన్ని పరిశుభ్రమైన, సుందరమైన నగరంగా తీర్చిదిద్దటానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పులి శ్రీనివాసులు మానవ సంబంధాల విశిష్టతను తెలిపే రవీంద్ర నాథ్ ఠాగూర్ రాసిన కవితను చదివి వినిపించారు. మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు ప్రసంగిస్తూ 2004లో 108 మంది సభ్యులతో ప్రారంభమైన మానవత నేడు 132 శాఖలకు విస్త రించి, 80 వేల సభ్యులతో పలు సామాజిక సేవా కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడం గొప్ప పరిణామమన్నారు.

జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ 1990వ దశాబ్దంలో అక్షరాస్యత ఉద్యమంలో ప్రభుత్వ యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు సమష్టిగా కృషి చేయడం వల్ల ఆ దశాబ్దంలో 17 శాతం అక్షరాస్యత పెరిగిందని, నేడు ఈ ప్రయోగాన్ని పునరావృతం చేసి అక్షరాస్యతలో 32వ స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను అక్షరాంధ్ర ప్రదేశ్‌గా మార్చాలన్నారు. మానవత చైర్మన్ పావులూరి రమేష్ ప్రసం గిస్తూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుంటూరు, తెనాలి, పొన్నూరు, బాపట్లలో మానవత శాఖలు ఏర్పడి పనిచేస్తున్నాయని, త్వరలో మరో 5 పట్టణాలలో మానవత శాఖలను ఏర్పాటు చేస్తామన్నారు.

● నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అధ్యక్షుడిగా డాక్టర్ కోట శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలిగా డాక్టర్ పి.కల్పన, కార్యదర్శిగా కే.సతీష్ బాబు, కోశాధికారిగా టీవీ సాయిరాం, సంయుక్త కార్యదర్శిగా కర్నాటి ఆనంద్‌లను ఎన్నుకొని వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మానవత పూర్వ అధ్యక్షుడు కొమ్మలపాటి శ్రీనివాసరావు, మెడికల్ విభాగ చైర్మన్ టి.ధనుంజయ రెడ్డి, విద్యా విభాగ చైర్మన్ ఎన్ అరవింద్, అవయవ దాన చైర్మన్ టి.సుందర రామయ్య, డైరెక్టర్లు ఉప్పల సాంబశివరావు, బీఎస్ మిత్ర, ఎన్ సాంబశివరావు, విమలకుమారి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సంగీత పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(తూర్పు), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక అశోక్‌నగర్‌లోని డాక్టర్ మంగ ళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభుత్వ సంగీత పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వాని స్తున్నట్టు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటక గాత్రం, వీణా, వయొలిన్, డోలు, మృదంగం, కూచిపూడి నృత్యం, నాదస్వరం విభాగాల్లో నాలుగేళ్ల సర్టిఫికెట్ కోర్సు, రెండేళ్ల డిప్లొమా కోర్సు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రవేశానికి 2005 తరువాత పుట్టినవారు, డిప్లొమా కోర్సులో చేరాలనుకునేవారు 15 ఏళ్ల నిండిన వారు అర్హులన్నారు. ఇతర వివరాలకు పాఠశాల కార్యాలయంలో గాని 0863 223913 అనే నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

SCHOLARSHIP ALERT

Mohan T Advani Centennial Scholarship Programme

Description: Blue Star Foundation aims at supporting and empowering underprivileged undergraduate and diploma students enrolled in Architecture and Engineering programs at selected private or government colleges across India through their flagship initiative, i.e. Mohan T Advani Centennial Scholarship Programme.

Eligibility: First and second-year students enrolled in a degree or diploma program in architecture and engineering, such as Mechanical Engineering, Electrical Engineering & Electronics Engineering and production Engineering, excluding Civil Engineering. Applicants must have scored a minimum of 80% in Class 10 and Class 12 for first-year students, and at least 80% in Class 12 and 75% in the 1st year for second-year students. Students enrolled in selected colleges* will be eligible to apply. Applicants' annual family income from all sources must be less than INR 6 lakh.



Prizes & Rewards:

- For engineering and architecture students: INR 1,00,000 or 75% of the annual fees (whichever is less)
- For diploma students: INR 40,000 or 90% of the annual fees (whichever is less)

Last Date: 15-07-2025 *Application:* Online only

Short Url: www.b4s.in/aj/BSFS4

Raman Kant Munjal

Description: The Raman Kant Munjal Scholarship 2025-26 is an initiative by the Raman Kant Munjal Foundation, supported by Hero FinCorp, that aims to help undergraduate students pursuing finance-related courses to pursue their dreams of a promising career and a better life.

Eligibility: "Students enrolled in the BBA, BFIA, B.Com. (H,E), BMS, IPM, B.A. (Economics), BBS, or any other finance-related degree courses are eligible.

- Applicants must have secured at least 80% marks in Classes 10 and 12. (70% marks for PwD students)
- The annual family income of the applicants should be less than INR 6 lakh.
- Open for Indian nationals only.

Prizes & Rewards: Scholarship from INR 40,000 to INR 5,50,000 per year for three years

Last Date to Apply: 31-07-2025

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/RMKSP5

buddy4study.com

నిన్న మొన్నటి దాకా ఇంజనీరింగ్ చదవాలనుకునే విద్యార్థుల మొదటి చాయిస్ కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వచ్చిన తరువాత పరిస్థితి మారింది. మార్కెట్‌లో ఉద్యోగాలు తగ్గడం మొదలయ్యాయి. పులిమీద పుట్రలా అమెరికా జాబ్ మార్కెట్ ఇబ్బందులతో మరింత క్షీణించింది. దీంతో సీఎస్సీ చదవాలనే విద్యార్థుల ఆలోచనలు మారి కోర్ సబ్జెక్టుల వైపు దృష్టి సారించడం మొదలుపెట్టారు. అంతే కాకుండా విద్యార్థులను ఇటువైపు మళ్లేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కోర్ బ్రాంచెస్‌లు ఎలా ఉంటాయో వివరిస్తున్నారు రాయ్‌పూర్ ఎన్ఐటీ డైరెక్టర్, సీనియర్ ప్రొఫెసర్ ఎన్.వి.రమణరావు. ఆయన గతంలో ఎంసెట్ కన్వీనర్‌గా, ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్‌గా పనిచేశారు.



ఎవర్ గ్రీన్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

కెరీర్ అవకాశాలు అధికంగా ఉన్న ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ వాస్తవానికి ప్రాక్టికల్ డిసిప్లిన్. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీర్లు కలగలిసి రీసెర్చ్ - డెవలప్‌మెంట్ సంస్థలు మొదలుకుని అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలు, ఇంజనీరింగ్ సర్వీసెస్ సంస్థలు, మాన్యుఫాక్చరింగ్, ప్రభుత్వ, టెక్ కంపెనీల్లో పనిచేయవచ్చు. 2021-2031 మధ్య పదేళ్లలో ఈ పరిశ్రమ ఎదుగుదల మూడు శాతంగా లెక్కగట్టారు. మన దేశంలో ఏటా సగటున ఇరవై వేల కంటే కొద్దిగా ఎక్కువ ఉద్యోగాలు ఈ పదేళ్లలో వీరికి లభిస్తాయి. ప్రజలందరూ కంప్యూటర్ వైపు వెళుతుండడంతో, వీరికి జాబ్ గ్యారెంటీ లభిస్తోంది అనే చెప్పాలి.

- అవకాశాల విషయానికి వస్తే ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్లకు ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, కంట్రోల్ సిస్టమ్, సిస్టమ్ మేనేజ్‌మెంట్, ప్రొడక్ట్ డిజైన్, సేల్స్, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ ట్రాన్స్‌పోర్టేషన్, వైర్‌లెస్ కమ్యూనికేషన్, మాన్యుఫాక్చరింగ్, కెమికల్, ఆటోమోటివ్, డిఫెన్స్, స్పేస్ రీసెర్చ్ తదితర సంస్థల్లో అవకాశాలు ఉంటాయి. నిర్దేశిత ప్రొఫెషన్‌కు మాత్రమే వీరు పరిమితం కారు కూడా.
- భిన్న రంగాలు అంటే హౌస్‌హోల్డ్ అప్లయిన్సెస్ డివిజన్, భవన నిర్మాణాల్లో ఎలక్ట్రికల్ సిస్టమ్ డిజైన్, ఎలక్ట్రిక్ వెహికల్స్/ కార్లు, రైల్వేస్, ఎయిర్‌పోర్ట్స్, రోబోటిక్స్, ఏరోస్పేస్, సాఫిస్టికేటెడ్ మెడికల్ ఎక్విప్‌మెంట్స్, ఎలక్ట్రిక్ పవర్ జనరేటింగ్ - ట్రాన్స్‌మిషన్ - డిస్ట్రిబ్యూషన్ సంస్థల్లో కెరీర్ అవకాశాలు ఉంటాయి.

సంబంధిత బ్రాంచీలు

ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్(పవర్ సిస్టమ్), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్), ఎలక్ట్రికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్ ఇంజనీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, పవర్ ఇంజనీరింగ్ ఉన్నాయి.

కెరీర్ అవకాశాలు

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదివిన వారికీ అనేకానేక అవకాశాలు ఉన్నాయి. హౌస్‌హోల్డ్ అప్లయిన్సెస్ డిజైనింగ్, భవనాలకు ఎలక్ట్రికల్ సిస్టమ్ డిజైన్, రైల్వేలు, విమానాశ్రయాలు, రోబోటిక్స్, ఏరోస్పేస్, ఎలక్ట్రిసిటీ జనరేషన్ - ట్రాన్స్‌మిషన్ - డిస్ట్రిబ్యూషన్, ఆసుపత్రుల్లో సాఫిస్టికేటెడ్ మెడికల్ ఎక్విప్‌మెంట్స్‌కు తోడు ప్రభుత్వ విభాగాల్లో అవకాశాలు ఉంటాయి. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎఎల్ఎస్‌టిఒఎం ఇండియా లిమిటెడ్, స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డ్, బీహెచ్ఈఎల్, ఎబిబి ట్రాన్స్‌ఫార్మర్స్ అండ్ ఎలక్ట్రికల్స్, ఎన్‌టీపీసీ, జీఈ, ప్రభుత్వ కళాశాలల్లో టీచింగ్, హెచ్‌పిఎల్, డీఆర్‌డీఓ, ఎల్ అండ్ టీ, ఇస్రో, క్రాంప్టన్ గ్రీవ్స్ పవర్ అండ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ లిమిటెడ్, నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్, సీడేక్, ఓఎన్‌జీసీ, ఐఓఎల్, ఇస్రో, ఐఓసీఎల్, బజాజ్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, పీడబ్ల్యూడీ, బీపీసీఎల్, సైమన్స్, హెచ్‌పీసీఎల్, జిందాల్ స్టీల్ అండ్ పవర్, హార్బర్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్, ఇండియన్ రైల్వేస్- ఆర్ఆర్‌బీ టాటా స్టీల్, ఇరిగేషన్ విభాగం, గెయిల్, టాటా మోటార్స్, సెయిల్, టాటా ఇలా పలు సంస్థల్లో అవకాశాలు ఉంటాయి.

ప్రయోజనాలు

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ తరవాత ప్రపంచంలో ఎక్కడైనా పనిచేసే అవకాశం ఉంటుంది. మేథ్స్, ఫిజిక్స్ సహా ఎలక్ట్రికల్ అప్లికేషన్స్‌కు సంబంధించిన గైడింగ్ ప్రిన్సిపల్స్‌లో మార్పు ఉండనందున గ్లోబల్ కంపెనీలన్నీ వీరిని తీసుకుంటాయి. అనుభవజ్ఞులకు మాదిరిగా ఎక్కువ వేతనాలు ఉండవు. అయితే ఫ్రెషర్స్‌ను కూడా మల్టీనేషనల్ కంపెనీలు తీసుకుని తమకు అవసరమైన రీతిలో శిక్షణ ఇచ్చుకుంటాయి. కొద్దికాలం అనుభవం గడించిన తరవాత ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చేసి పొజిషన్‌ను మెరుగుపర్చుకోవచ్చు.



ప్రొ. ఎన్.వి.రమణారావు

దిక్సూచి

ఎస్ఎస్‌సీ కంబైన్డ్ హయ్యర్ సెకెండరీ, గ్రాడ్యుయేట్ లెవెల్ నోటిఫికేషన్

గ్రాడ్యుయేట్ లెవెల్: స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్ష నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లోని 14,582 ఖాళీలను భర్తీ చేయనున్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. కొన్ని పోస్టులకు కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్‌లో మేథ్స్ పాసై ఉండాలి.

వయస్సు: 2025 ఆగస్టు 1వ తేదీ నాటికి 18 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

చివరి తేదీ: 2025 జూలై 4

ఎంపిక విధానం:

- టైర్-1 సీబీటీ ఆబ్జెక్టివ్ పరీక్ష
- టైర్-2 సీబీటీ - ఆబ్జెక్టివ్ పరీక్ష + స్కిల్ టెస్టులు
- డాక్యుమెంట్ వెరిఫికేషన్

వెబ్‌సైట్: https://ssc.gov.in/



కంబైన్డ్ హయ్యర్ సెకెండరీ: స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కంబైన్డ్ హయ్యర్ సెకెండరీ లెవెల్ పరీక్ష నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంటర్ పూర్తిచేసిన వారు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 3131 ఖాళీలు ఉన్నాయి

- లోయర్ డివిజన్ క్లర్క్(ఎల్‌డీసీ), జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్
- డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో)
- డేటా ఎంట్రీ ఆపరేటర్(గ్రేడ్-ఏ)

అర్హత: ఇంటర్మీడియేట్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఓపెన్ స్కూల్ విద్యార్థులూ అర్హులు. కొన్ని పోస్టులకు మాత్రం ఇంటర్‌లో మేథ్స్ పాసై ఉండాలి.

వయస్సు: 2026 జనవరి 1వ తేదీ నాటికి 18 నుంచి 27 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 1999 జనవరి 1 నుంచి 2008 జనవరి 1వ తేదీన జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు 15 సంవత్సరాల గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

చివరి తేదీ: 2025 జూలై 18

వెబ్‌సైట్: https://ssc.gov.in/

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

మధ్యతరగతి కుటుంబాల కథ



సిద్ధార్థ్, శరత్‌కుమార్, దేవయాని ప్రధాన పాత్రల్లో శ్రీ గణేశ్ తెరకెక్కించిన చిత్రం '3బీహెచ్‌కే'. శాంతి టాకీస్ బేనర్‌పై అరుణ్ విశ్వ నిర్మించారు. జూలై 4న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో హీరో సిద్ధార్థ్ మాట్లాడుతూ ' తండ్రీకొడుకుల అనుబంధాన్ని బొమ్మరిల్లు సినిమాలో చూశారు. అలాంటి అనుబంధాన్నే ఇప్పుడు '3బీహెచ్‌కే' చిత్రంలో చూస్తారు' అని అన్నారు. నటుడు శరత్‌కుమార్ మాట్లాడుతూ 'మనమందరం మధ్యతరగతి కుటుంబాల నుంచే వచ్చాం. ఇల్లు కట్టుకోవాలనే కల అందరికీ ఉంటుంది. ఇల్లు అనేది ఒక గౌరవం. కుటుంబ సభ్యులంతా ఒకే చోట కూర్చొని చూడదగిన చిత్రమిది' అని అన్నారు. చిత్రదర్శకుడు శ్రీ గణేశ్ మాట్లాడుతూ 'మా సినిమా అందరికీ కనెక్ట్ అవుతుందనే నమ్మకం ఉంది. చాలా ప్రేమతో ఈ సినిమా తీశాం. ఆదరించాలని ప్రేక్షకులను కోరుతున్నా' అని అన్నారు. చిత్ర నిర్మాత అరుణ్ విశ్వ మాట్లాడుతూ 'ఈ చిత్రం నా జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోతుంది' అని అన్నారు.

భారతీయ సినీరంగం గర్వించే విషయం

- పవన్‌కల్యాణ్



హీరో కమల్ హాసన్ ఆస్కార్ కమిటీలో సభ్యుడిగా ఎంపికవ్వడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. ఇది భారతీయ సినీరంగం గర్వించే విషయమని ప్రశంసించారు. "ప్రపంచమంతా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డుల కమిటీలో సభ్యుడిగా పద్మభూషణ్ కమల్ హాసన్ ఎంపికవ్వడం భారతీయ సినీరంగం గర్వించదగ్గ విషయం. ఆరు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో ఆయన నటుడిగా, దర్శకుడిగా, కథకుడిగా భారతీయ, ప్రపంచ సినిమాపై చెరగని ముద్ర వేశారు. సినిమా మేకింగ్ విషయంలో ఆయనకు ఉన్న పట్టు స్ఫూర్తిదాయకం. ప్రపంచ సినిమాకు ఆయన ఇలాగే మరింత కాలం సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నాను" అని పేర్కొన్నారు. కాగా, 'ది అకాడెమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' ఇటీవల విడుదల చేసిన కొత్త కమిటీ సభ్యుల జాబితాలో భారత్ నుంచి కమల్ హాసన్‌తో పాటు నటుడు ఆయుష్మాన్ ఖురానా, దర్శకురాలు పాయల్ కపాడియా, ఫ్యాషన్ డిజైనర్ మాక్సిమా బసు ఉన్నారు. హాలీవుడ్ నటీనటులతో పాటు ఆస్కార్ ఓటింగ్ ప్రక్రియలో వీరు పాలుపంచుకోనున్నారు.



సీక్వెల్ రాబోతోంది

యూత్‌ను విపరీతంగా ఆకట్టుకున్న సినిమాల్లో 'ఈ నగరానికి ఏమైంది' ఒకటి. విశ్వక్ సేన్ కథానాయకుడిగా తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వంలో 2018లో విడుదలైన ఈ చిత్రానికి కొనసాగింపు భాగం ఎప్పుడెప్పుడు వస్తుందా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. ఆదివారం ఈ సినిమాకు సీక్వెల్ రాబోతుందని ప్రకటించారు మేకర్స్. 'ఈఎన్ఈ రిపీట్' అనేది టైటిల్. 'ఏలినాటి శనిపోయింది. కన్యారాశి టైమ్ వచ్చింది' అనేది ట్యాగ్‌లైన్. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉందీ చిత్రం. మొదటి పార్ట్‌కు పనిచేసిన చిత్రబృందమే ఈ సీక్వెల్‌లోనూ భాగమవుతున్నారు. తరుణ్‌భాస్కర్ దాస్యం దర్శకత్వంలో డి.సురేశ్‌బాబు, సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి నిర్మించనున్నారు. విశ్వక్ సేన్, సాయి సుశాంత్ రెడ్డి, అభినవ్ గోమఠం, వెంకటేశ్ కాకుమాను ప్రధాన పాత్రలు పోషించనున్నారు.

యువతను ఆకట్టుకునేలా...



నూతన నటుడు సాయికృష్ణ హీరోగా వెంకటరమణ పసుపులేటి ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవలె ప్రారంభించిన ఈ సినిమాకు 'పవర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "యువతను ఆకట్టుకునే కథాంశంతో పాటు అద్భుతమైన సాంకేతిక విలువలతో చిత్రం ఉంటుంది. టాలీవుడ్‌లో కొత్త ఒరవడి సృష్టిస్తుంది" అని అన్నారు. ఆ చిత్రానికి ఎడిటర్: నందమూరి హరి, సినిమాటోగ్రఫీ: బి.ఎస్.కుమార్, సంగీతం: శంకర్ మహదేవన్.

షఫాలీ మృతికి కారణమిదేనా?



'కాంటా లగా' సాంగ్ ఫేమ్ షఫాలీ జరివాలా(42) ఆకస్మిక మృతిపై పలు అనుమానాలు రేకెత్తుతున్న సంగతి తెలిసిందే. ఆమె గుండెపోటుతో మరణించారని మొదట వార్తలు వచ్చాయి. ఆమె కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసులు మృతికి గల పూర్తి కారణాలను ఇంకా వెల్లడించలేదు. మరోవైపు అందంపై ఉన్న మమకారమే ఆమె ప్రాణాలు కోల్పోయేలా చేసిందని నెట్టింట వార్తలు వస్తున్నాయి. ఆమె కొంతకాలంగా యాంటీ ఏజింగ్ చికిత్సను తీసుకుంటున్నట్లు సమాచారం. శుక్రవారం ఇంట్లో పూజ ఉండడంతో ఆమె ఆ రోజంతా ఉపవాసం ఉన్నారని.. ఖాళీ కడుపుతో యాంటీ ఏజింగ్ ఔషధాలు, ఇంజెక్షన్లు తీసుకోవడంతో అవి వికటించి గుండెపోటుకు దారి తీసుంటాయని వార్తలు వస్తున్నాయి.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

ఏపీ పీజీసెట్‌లో తాడికొండ విద్యార్థికి ద్వితీయ ర్యాంకు

తాడికొండ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఏపీ పీజీసెట్‌లో తాడికొండ విద్యార్థిని ద్వితీయ ర్యాంకు సాధించినట్లు గోగినేని కనకయ్య ఓరియంటల్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహించిన పీజీసెట్‌లో తాడికొండలోని గోగినేని కనకయ్య ఓరియంటల్ కళాశాల విద్యార్థిని షేక్ సల్మాకు స్టేట్ రెండో ర్యాంకు వచ్చినట్లు తెలిపారు. అంతేకాకుండా పిల్లెమ్ శ్యామల 18వ ర్యాంకు, అల్లం వెంకట శివసాయి ప్రేమ్‌కుమార్ 25వ ర్యాంకు, గుగులోతు వెంకటేశ్వర్ల నాయక్ 45వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించి కళాశాల ఉన్నతికి పాటుపడిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ రాయపాటి మోహనసాయికృష్ణ, జాయింట్ సెక్రటరి పీ గోపీచంద్, పాలనవర్గ సభ్యులు త్రిపురనేని మల్లేశ్వరరావు అభినందించారు.

నేడు పీజీఆర్ఎస్

కాకుమాను, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని తహసీల్దార్ వెంకట స్వామి ఆదివారం ఒక ప్రకనటలో తెలిపారు. మండల స్థాయి ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని, ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

రేపటి నుంచి ఉచిత యోగా శిబిరం

మంగళగిరి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శ్రీ గీతా యోగ ఆరోగ్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో జూలై ఒకటో తేదీ నుంచి ఉచిత యోగ శిక్షణా శిబిరం ప్రారంభమవుతుందని ప్రధాన యోగాచార్యులు పంచుమర్తి సత్యనారాయణ తెలిపారు. 15 రోజులపాటు జరిగే ఈ శిబిరంలో యోగాసనాలు, ప్రాణాయామంతో పాటు ఆరోగ్య నియమాలను బోధిస్తారని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

హజ్ యాత్రికులకు సబ్సిడీ నిధులను విడుదల చేయాలి

దుగ్గిరాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): హజ్ యాత్ర చేసిన హాజీలకు రావలసిన ప్రభుత్వ సబ్సిడీ నిధులు విడుదల చేయాలని ముస్లిం మైనార్టీసెల్ ప్రధాన కార్యదర్శి షేక్ సుబాని విజ్ఞప్తి చేశారు. ముర్తుజానగర్‌లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సుబాని మాట్లాడుతూ 2024-25లో పవిత్ర హజ్‌యాత్ర చేసిన వారికి సబ్సిడీ నిధులు జమచేయలేదని, 2026లో హజ్‌యాత్ర చేసేవారి కోసం ప్రాథమిక ఏర్పాట్లకై కేంద్ర హజ్ కమిటీ ఉత్తర్వులు కూడా జారీచేసిందని, జూలై రెండోవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుందని చెప్పిన విషయం తెలిసిందేనన్నారు. హజ్‌హౌస్ నిర్మాణంతోపాటు, 50 ఏళ్లు నిండిన ముస్లింలందరికీ పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.

చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులు

తాడేపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలో భాగంగా తాడేపల్లిలో పని చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు చట్ట ప్రకారం ఇవ్వాల్సిన క్యాజువల్ లీవులు, వీక్ ఆఫ్‌లు ఇవ్వకుండా చట్ట విరుద్ధంగా అధికారులు పని చేయడం సరియైన పద్ధతి కాదని సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. ఆదివారం కృష్ణనగర్‌లో జరిగిన వాటర్ వర్క్స్ కార్మికుల గ్రూప్ సమావేశంలో దుర్గారావు మాట్లాడుతూ నెలకు 30 రోజులు, వారితో గొడ్డుచాకిరి చేయించుకోవడం తగునా అని ప్రశ్నించారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. తాడేపల్లి నుంచి కుంచనపల్లి, గుండిమెడ, ప్రాతూరు, మెల్లెంపూడి చిర్రావూరు వరకు ఇక్కడ నుంచి కార్మికులు తమ సొంత ఖర్చులతో రాకపోకలు సాగించాల్సి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఆంజనేయులు, మురళి, రాజు, నరసింహారావు, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

సంగీత పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(తూర్పు), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక అశోక్‌నగర్‌లోని డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభుత్వ సంగీత పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటక గాత్రం, వీణా, వయోలిన్, డోలు, మృదంగం, కూచిపూడి నృత్యం, నాదస్వరం విభాగాల్లో నాలుగేళ్ల సర్టిఫికెట్ కోర్సు, రెండేళ్ల డిప్లొమా కోర్సు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇతర వివరాలకు పాఠశాల కార్యాలయంలో గాని 0863 223913 అనే నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

సహజ సంపద దోపిడికే ఆపరేషన్ కగార్

● జంగాల అజయ్‌కుమార్

గుంటూరు(తూర్పు), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సహజ సంపదను దోచుకునేందుకే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను తీసుకువచ్చిందని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ విమర్శించారు. స్థానిక హనుమాన్‌నగర్‌లో ఆదివారం జరిగిన ఆ పార్టీ శాఖ మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అటవీ సంపదలను కార్పొరేట్‌లకు కట్టబెట్టడమే ఆపరేషన్ కగార్ లక్ష్యమని ఆయన అన్నారు.

వర్షం కోసం ఆశగా రైతుల ఎదురుచూపులు

- ఊరిస్తున్న వానలు
- ఖరీఫ్ సాగుకు సిద్ధమైన రైతులు
- వర్షాలు లేక సాగని పనులు



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

తాడికొండ జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వర్షం కోసం అన్నదాత ఆశగా ఎదురు చూస్తున్నాడు. రోజూ మేఘాలు రావడం ఆవిరైపోవడం తప్పితే ఆశాజనకంగా వర్షాలు కురవడం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రైతుల సాగుకు అవసరమైన మొత్తంలో వర్షాలు కురవలేదు. ఫలితంగా అన్నదాతలు 'వానమ్మ ఓసారి వచ్చి పోవమ్మా' అంటూ ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. కొద్ది రోజులుగా వాతావరణంలో మార్పులు వచ్చినట్లే వచ్చి చిరు జల్లులతో సరిపెడుతోంది. వారం క్రితం కొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షానికి పొలాలు పూర్తి స్థాయిలో తడవలేదు. పొలాలు పదనైనా కాక ముందే దుక్కులు దున్ని పంటలకు సిద్ధం చేసుకుం టున్నారు. మరోసారి పెద్ద వర్షం కురిస్తే తప్ప విత్తనాలు నాటేందుకు అనుకూలమైన వాతావరణం లేదని.. వర్షం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

● సాగుపై అయోమయం..

మే నెలలో కురిసినట్లుగా జూన్ నెలలో వర్షాలు సమపాళ్లలో వర్షాలు కురవలేదు. వర్షాలు వచ్చినట్లు వచ్చి చిరు జల్లులతో సరిపెడుతుండడంతో రైతులు సాగుపై అయోమయంలో ఉన్నారు. బోర్లపై అధారపడి పండించే పంటలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. సాగులో ఎక్కువగా పత్తి, మిర్చి, అపరాల సాగును చేయటానికి రైతులు సన్నద్ధం అయ్యారు. గతంలో ఎన్నడూ ఈ సమయంలో ఇటువంటి గందరగోళ పరిస్థితులు లేదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం తాడికొండ మండలంలో 30 వేల ఎకరాల్లో సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. సకాలంలో వరుణుడు కరుణించకపోతే అన్నదాత ఆశలు ఆవిరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో వర్షాల కోసం పూజలు కూడా చేస్తున్నారు. వర్షం ఎప్పుడు వచ్చినా విత్తు వేయటానికి సిద్ధంగా ఉన్నారు.

వర్షాలు వస్తే సాగుకు సిద్ధం

- వెంకయ్య, రైతు, తాడికొండ

ఖరీఫ్ ప్రారంభమైనా వాన జాడలేదు. దుక్కి దున్ని సాగుకు సిద్ధం చేశా. చిన్నపాటి వర్షాలు కురిసినా సాగుకు ఉపయోగకరంగా కన్పించటం లేదు. మరో వారం దాటిలే అదును తప్పుతుంది. ఏమి చేయాల్లో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వ నిర్ణయం రాజధాని రైతులకు అన్యాయం

● రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకర్



సమావేశంలో ప్రసంగిస్తున్న జొన్నా శివశంకర్

తాడేపల్లి(ఉండవల్లి), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి మరో 44వేల ఎకరాలు తీసుకోవాలని నిర్ణయించుకోవడం గతంలో రాజధానికి భూములిచ్చిన రైతులకు అన్యాయం చేయడమేనని రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఉండవల్లి సెంటర్ ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన రాజధాని రైతుసంఘం డివిజన్ కమిటీ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరావతిలో మరో 44వేల ఎకరాలు భూములు సమీకరించాలని ప్రభుత్వ నిర్ణయం వల్ల గతంలో రాజధాని 29 గ్రామాల్లో 33వేల ఎకరాల భూసమీకరణకు ఇచ్చిన రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం తలపెట్టిన రెండవ విడత భూ సమీకరణను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. గతంలో భూములిచ్చిన రైతులకు ప్లాట్లలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు నవనగరాల నిర్మాణం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల వార్షిక కౌలు నగదును వెంటనే వారి ఖాతాల్లో జమచేయాలని కోరారు. స్మార్ట్ మీటర్ల ఎత్తివేత, విద్యుత్ సంస్కరణల ఎత్తివేత, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు, తదితర అంశాలపై జులై 9న జరుగు సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో రాజధాని డివిజన్ రైతు సంఘం కార్యదర్శి ఎం రవి, రాజధాని డివిజన్ రైతు సంఘం అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరావు, గణేష్, నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరుకు సిద్ధమవ్వాలి

● సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య

తాడేపల్లి టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఐ పోరాటాలకు సిద్ధమవ్వాలని సీపీఐ మంగళగిరి నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య పిలుపునిచ్చారు. ఆదివారం తాడేపల్లి సీపీఐ కార్యాలయంలో సెంట్రల్‌శాఖ మహాసభ తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమిల్ల వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కంచర్ల కాశయ్య మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాలుగా రైల్వే గేటు వద్ద అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని సీపీఐ పోరాటం చేసిందన్నారు. బకింగ్‌హామ్ కెనాల్ వంతెన శిథిలావస్థకు చేరుకుందని, వెంటనే నూతన బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. రైల్వే స్థలాల్లో నివసిస్తున్న పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలన్నారు. మంత్రి లోకేశ్ కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల పట్టాలు ఇవ్వడం అభినందనీయమని, మిగిలిన వారికి కూడా పట్టాలు ఇవ్వాలని కోరారు. జూలై 20న సీపీఐ తాడేపల్లి ప్రాంత మహాసభ సీపీఐ కార్యాలయంలో జరుగుతుందని, నియోజకవర్గ మహాసభ 27న మంగళగిరిలో, ఆగస్టు 5, 6, 7 తేదీల్లో సీపీఐ మహాసభలు గుంటూరులో, ఆగస్టు 23, 24, 25 తేదీల్లో ఒంగోలులో రాష్ట్ర మహాసభలు జరుగుతాయని, అక్టోబర్‌లో చండీఘర్‌లో జాతీయ మహాసభలు జరుగుతాయని తెలిపారు.

టెట్‌లో ఎన్ఆర్ఐ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థికి నగదు బహుమతి అందజేస్తున్న ఎన్ఆర్ఐ ఈడీ తిలక్‌బాబు

మేడికొండూరు జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన ఏపీ టెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్టు మేడికొండూరు సమీపంలోని ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాల పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ పి.రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ పి.మనోహర్ ఆదివారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రథమ సంవత్సరం విడుదలైన ఫలితాల్లో అద్దేపల్లి అమిత్ నారాయణ 9.86 జీపీఏ సాధించారని తెలిపారు. నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో పత్తిపాటి బ్రహ్మం పదికి పది జీపీఏ సాధించి ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలన్నిటిలో అత్యుత్తమ ఫలితాన్ని సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా పేద కుటుంబం నుంచి విద్యనభ్యసిస్తున్న అమిత్ నారాయణకు ప్రథమ సంవత్సరంలోనే 9.86 జీపీఏ సాధించినందుకు కళాశాల యాజమాన్యం, కళాశాలల చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.శరత్ రూ.15 వేల చెక్కును బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్‌బాబు మాట్లాడుతూ ఈ సంవత్సరం 183 మందికి ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.సంజయ్, ఏవో బండారు సీతారామయ్య పాల్గొన్నారు.

హెచ్ఎంగా రమేష్‌కుమార్ సేవలు అభినందనీయం

సన్మాన సభలో కొర్రపాడు గ్రామస్థులు



హెచ్ఎంగా ఉద్యోగ విరమణ చేసిన రమేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న కొర్రపాడు గ్రామస్థులు

మేడికొండూరు జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దిన జంపాల రమేష్‌కుమార్ అందించిన సేవలు అభినందనీయమని కొర్రపాడు గ్రామస్థులు కొనియాడారు. కొర్రపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన రమేష్ కుమార్ దంపతులను ఆదివారం గ్రామస్థులు సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పలువురు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా 36ఏళ్ల పాటు విద్యార్థులకు ఆయన అందించిన సేవలు మరువలేమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పాములపాటి శ్రీనివాస్, జిల్లా ఈజేపీ కార్యదర్శి వైవీ సుబ్బారావు, జనసేన నియోజకవర్గ మీడియా కన్వీనర్ కందుల సైదయ్య, మందపాడు జడ్పీ హైస్కూలు హెచ్ఎం శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లిపెద్ది రమేష్ తదితరులతో పాటు గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

మంగళగిరి సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ డీఎస్ రాజు నాయుడు కోరారు. ప్రజారోగ్య వేదిక మంగళగిరి రీజియన్ ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి రత్నాల చెరువులో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పారంభించిన రాజు నాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని, కరోనా సమయంలో వైద్యం కోసం ప్రజలు పడిన ఇబ్బందులను ఆయన గుర్తుచేశారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కేవీఎస్ సాయిప్రసాద్ మాట్లాడుతూ ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో అనేక సంవత్సరాలుగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి పేదలకు వైద్యం ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో 15 సంవత్సరాలుగా పోరాటం చేసి మంగళగిరిలో వంద పడకల ఆస్పత్రిని సాధించుకున్నామన్నారు. వివిధ విభాగాల వైద్యులు రాజు నాయుడు, గిరిజ, ఎం వంశీకృష్ణ, లక్ష్మీప్రియాంక, గీష్మ, పీ వంశీకృష్ణ, వీ సింధూర, హేమంత్ మాకినేని, ఎం హిమని, ప్రభుత్వ వైద్యాధికారి పీ అనూష హాజరై వైద్య సేవలను అందించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక కార్యదర్శి ఏ జయరాజు, కన్వీనర్ వీవీ ప్రసాద్, నేతలు డీ నాగమణి, ఎస్ బాలకృష్ణ, వీ వెంకటేశ్వరరావు, రాఘవులు, చెంగయ్య, ఎం రవి, ఎం చలపతిరావు, బాలాజీ, చంద్ర, ఐజాక్ న్యూటన్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించండి

తాడేపల్లి టౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): గంటకో ధర వసూలు చేయడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ మీటర్లు బిగించడానికి ఎవరైనా ఇంటికి వస్తే వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై నేతాజీ పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం ప్రకాష్‌నగర్ సీపీఎం కార్యాలయంలో జరిగిన వివిధ రంగాల కార్మికుల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో మంత్రి లోకేశ్ స్మార్ట్ మీటర్లను పగులగొట్టండని పిలుపునిచ్చారని నేడు అవే స్మార్ట్ మీటర్లను ఎలా బిగించమంటున్నారని ఆయన ప్రశ్నించారు. కొంతకాలంగా ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థల్లో స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల ప్రజలు ఈ విషయమై ప్రశ్నల కురిపిస్తున్నా ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తుందన్నారు. సమావేశంలో సీపీఎం నేతలు పల్లె కృష్ణ, దుర్గారావు, బాబూరావు, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీగంగానమ్మ గ్రామోత్సవం



శ్రీగంగానమ్మ బోనాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

దుగ్గిరాల, జూన్ 29(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని శ్రీగంగానమ్మ గ్రామోత్సవం, శ్రీచండీహోమం ఆదివారం అత్యంత వైభవంగా ఆదివారం నిర్వహించారు. దుగ్గిరాల హైస్కూల్ సమీపంలోగల అమ్మవారి ఆలయానికి, వందలాది మంది మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. మంగళవాయిద్యాలు, భక్తిగీతాలతో గ్రామం మార్మోగింది. గ్రామోత్సవంలో పాల్గొన్నారు. పలువురు దంపతులు శ్రీచండీ హోమంలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


పెదవడ్లపూడిలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారుడికి చెక్కును అందజేస్తున్న కిరణ్‌చంద్, టీడీపీ నేతలు

మంగళగిరి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఆదివారం టీడీపీ నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. పెదవడ్లపూడి గ్రామానికి చెందిన గోలి చైతన్యకు రూ.45 వేలు, మాదల నవదీప్‌కు రూ.65,800, రామినేని ప్రేమలతకు రూ.42,292 చొప్పున ఆర్థికసాయం మంజూరైంది. ఈ చెక్కులను గ్రామ టీడీపీ నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. సీఎం సహాయ నిధి మంజూరు కావడానికి కృషి చేసిన మంత్రి లోకేశ్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మంగళగిరి మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్, ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గాదె పిచ్చిరెడ్డి, నేతలు మల్లవరపు వెంకట్, యేళ్ల శివరామయ్య, మాదల రమేష్‌బాబు, గుడిమెట్ల మరియదాసు, కొడవలి ఆనంద్, మొద్దుకూరి రమేష్‌బాబు, కంచర్ల బద్రి, షేక్ బాజీవలి, కంచర్ల బుల్లెబ్బాయ్, బొర్రా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఒకటి, రెండు వార్డు కమిటీల ఎన్నిక



నూతనంగా ఎన్నికైన ఒకటి, రెండు వార్డు కమిటీల ప్రతినిధులు

మంగళగిరి సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణంలోని ఒకటి, రెండు వార్డుల తెలుగుదేశం పార్టీ కమిటీలను ఆదివారం ఎన్నుకున్నారు. ఒకటో వార్డు అధ్యక్ష, కార్యదర్శులుగా సైనాథం శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా నాగేశ్వరరావు, రెండో వార్డు అధ్యక్షుడిగా కట్టా దుర్గాప్రసాదరావు, ప్రధాన కార్యదర్శిగా పణిదపు మల్లేశ్వరరావు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రంగిశెట్టి నరేంద్ర, నేతలు సుఖమంచి గిరిబాబు, తాడిగిరి సుధీర్, రంగిశెట్టి పెద్దబ్బాయ్, రంగిశెట్టి లక్ష్మీ, రామనాథం కోటేశ్వరరావు, మాయకుంట క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తసేకరణ ప్రత్యేక డ్రైవ్‌కు విశేష స్పందన

దుగ్గిరాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణపై అవగాహనకై నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని ఎంపీడీవో అడిగొప్పుల శ్రీనివాసరావు తెలిపారు. మూడు రోజులుగా మండలంలోని పద్దెనిమిది గ్రామపంచాయతీల పరిధిలో పారిశుధ్య సిబ్బందితో ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించి సంపదకేంద్రాలకు తరలించామన్నారు. డిప్యూటీ ఎంపీడీవో జవహర్‌లాల్, పంచాయతీ కార్యదర్శి వివేకానంద, ఇతర గ్రామ కార్యదర్శుల సహకారంతో, ఆయా గ్రామాల్లోని, సంపద కేంద్రాలల్లో తయారు చేసిన వర్మి కంపోస్టును రైతులు, ప్రజలకు విక్రయిస్తున్నామన్నారు. బహిరంగ ప్రదేశాలు, జనావాసాల మధ్య చెత్తను వేస్తే రూ.500 జరిమానా విధిస్తామని ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. ప్రత్యేక డ్రైవ్‌లో పారిశుధ్య సిబ్బందికి సహకరించిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు.

రాజధాని గ్రామాల్లో కార్మికుల సందడి



రాజధాని గ్రామం తుళ్లూరులో కార్మికులతో నెలకొన్న సందడి

తుళ్లూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణ పనులకు ఆయా కంపెనీలకు సీఆర్‌డీఏ ఏడీసీ టెండర్లు కేటాయించిన సంగతి తెలిసిందే. దీంతో నిర్మాణరంగ కంపెనీలు పనులు మొదలుపెట్టాయి. ఒడిశా, చత్తీస్‌గఢ్, యూపీ, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి కార్మికులను రప్పిస్తున్నారు. ఇప్పటికే పది వేల మంది పైగా కార్మికులు వచ్చినట్టు సమాచారం వర్షాలు పడుతుండటంతో పనులు మందకొడిగా సాగుతున్నాయి. లేకపోతే 50 వేల మంది కార్మికులు వచ్చి ఉండేవారని ఏజెన్సీ కంపెనీలు చెపుతున్నాయి. ఆదివారం సెలవు రోజు కావటంతో కార్మికులు వారికి కావాల్సి పచారి సరుకులు, కూరగాయలు వారానికి సరిపడే విధంగా కొనుగోలు చేశారు. దీంతో రాజధాని గ్రామాల్లో ఆదివారం కార్మికులతో సందడి నెలకొంది.

ఎయిమ్స్ ఉద్యోగుల సంఘం కమిటీ ఏర్పాటు



ఎయిమ్స్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ కమిటీ ప్రతినిధులు

మంగళగిరి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎయిమ్స్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ పేరిట సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేయించినట్టు యూనియన్ నేతలు తెలిపారు. యూనియన్ తొలి కార్యవర్గ సమావేశం ఆదివారం నవులూరు గ్రామంలోని కమ్యూనిటీ హాల్లో జరిగింది. ఎయిమ్స్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా జీ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పీ శివశంకర్, ఉపాధ్యక్షుడిగా ఎన్ సురేష్, కోశాధి కారిగా టీ రాంబాబు, సంయుక్త కార్యదర్శిగా షాజీద్, కోర్ కమిటీ సభ్యులుగా జీ యోహాను, కే సతీశ్‌లను ఎన్నుకున్నట్టు ప్రకటించారు.

ఆందోళనను జయప్రదం చేయాలి

పెదనందిపాడు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటుకై చేపడుతున్న ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘ జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు అన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఆదివారం రైతులతో సమావేశాలు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇంతవరకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదని దీనిలో భాగంగా జూలై 1న పాతబస్టాండ్ సెంటర్లో ఆందోళన కార్యక్రమం చేపడతామని, అనంతరం తహసీల్దార్ కార్యాయం వద్దకు ర్యాలీగా వెళ్లి నిరసనతో పాటు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. పెదసంఖ్యలో రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకుడు నల్లమోతు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

మద్యం మత్తులో గుర్తు తెలియని వ్యక్తి హల్‌చల్

తెనాలి, మారీసుపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో గుర్తు తెలియని వ్యక్తి హల్‌చల్ చేసిన ఘటనపై బాధితుల పిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు స్థానిక నాజరుపేటలో ఒక భవనంలో నివాసముండే పాదర్తి అను పమ ఇంటికి గుర్తు తెలియని వ్యక్తి శనివారం మధ్యాహ్నం వచ్చాడు. వారి ఇంటి తలుపులను తట్టగా డోర్‌తీసి ఏవరు కావాలని ప్రశ్నించగా ఆమెను నెట్టివేసి దౌర్జన్యంగా ఇంటిలోకి ప్రవేశించడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో సదరు మహిళ ఆ వ్యక్తిని బయటకు నెట్టి డోర్ లాక్ చేసుకుని స్థానికులకు ఫోన్ ద్వారా విషయం తెలిపింది. స్థానికులు రావడం గమనించి ఆవ్యక్తి ఆ ప్రాంతం నుంచి పరారయ్యాడు. సీసీ ఫుటేజ్‌లో నిందితుడి కదలికలు నమోదు కావడంతో బాధితురాలు ఆదివారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసు తెలిపారు.

నేడు పురపాలక సంఘ సాధారణ సమావేశం

తెనాలి మారీసుపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నేడు సోమవారం పురపాలక సంఘ సాధారణ సమావేశాన్ని నిర్వహించనున్నామని మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక తెలిపారు. పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ నందు ఉదయం గం. 11.30 ని. లకు సాధారణ సమావేశాన్ని నిర్వహిస్తామని మునిసిపల్ కౌన్సిల్ సభ్యులు, ఎక్స్ అఫిషియో మెంబర్లు, కో ఆప్షన్ సభ్యులు వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని చైర్‌పర్సన్ రాధిక ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కొలకలూరులో అక్రమంగా మట్టి తవ్వకాలు

తెనాలి రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరులో శనివారం రాత్రి అక్రమంగా మట్టి తరలిస్తుండగా పలువురు గ్రామస్థులు అడ్డుకున్నారు. జగనన్న కాలనీ సమీపంలో జేసీబీ సాయంతో ట్రాక్టర్లలోకి మట్టినింపుతుండగా గ్రామస్థులు గమనించి నిలుపుదల చేయించారు. అక్రమ తవ్వకాలపై అధికారులు దృష్టిపెట్టి కట్టడి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కొత్తపేటలో వైద్య శిబిరం

తెనాలి అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కొత్తపేటలోని బ్రాహ్మణ పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హెల్త్ హాస్పటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో వైద్యులు శ్రీకాంత్, ఎం.రామలింగేశ్వరరావు, సత్యంరెడ్డి, హరిణి, నరేష్‌లు రోగులను పరీక్షించారు. బీపీ, షుగర్, ఈసీజీ, బోన్ డెన్సిటీ పరీక్షలు చేశారు. పరిషత్ అధ్యక్షుడు పార్థసారథి, కార్యదర్శి సాయికిరణ్, రామచంద్రమూర్తి, శ్రీనివాస్, మురళి, రామకృష్ణ, సీఈవో గిరిబాబు తదితరులు పర్యవేక్షించారు.

స్మార్ట్ మీటర్లు వెనక్కి పంపాలి

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాబుప్రసాద్

తెనాలి అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలంతా ఇళ్లలో స్మార్ట్ మీటర్లను పెట్టనివ్వకుండా వెనక్కి పంపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బాబుప్రసాద్ కోరారు. పట్టణంలో శాంతినగర్‌లో ఆదివారం స్మార్ట్ మీటర్లపై ప్రజలకు వివరించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దానిని కొనసాగించడం విడ్డూరంగా ఉందన్నారు. అదానీ సంస్థకు చెందిన మీటర్లు బిల్లులు ఎక్కువగా వస్తాయని, ప్రజలపై భారం పడుతుందన్నారు. బిల్లుతో పాటు ఎన్నోరకాల చార్జీలు వేస్తున్నారని మండిపడ్డారు. హుస్సేన్‌వలి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం బుర్రిపాలెం రోడ్డులోని శ్రీమహాత్మా గాంధీ శాంతి వృద్ధాశ్రమంలో ఎస్‌వీ యోగా సభ్యులు కన్నెగంటి నందకిషోర్, బేబీ గంగాల వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారి తల్లిదండ్రులు కన్నెగంటి పిచ్చయ్య, సుశీల, కుటుంబ సభ్యులు ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లను పంపిణీచేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌వీ యోగా సభ్యులు ముద్దాభక్తుని రమణయ్య, తన్నీరు శివశంకర్, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, సత్యనారాయణ, సుమతి పలువురు యోగ సాధకులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వారాహి నవరాత్రి ఉత్సవాలు

పొన్నూరు టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణ శివారులోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. నాల్గోరోజు ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తికి పంచామృత అభిషేకాలు జరిపారు. సాయంత్రం అభిషేక హరిద్ర పసుపుతో ప్రత్యేక పూజలు కుంకుమార్చనలు జరిగాయి. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పీబీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం

పొన్నూరు టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పీబీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం మండల పరిధిలోని వల్లభరావుపాలెంలో జరిగింది. 1979-1982 బీకాం విద్యను అభ్యసించిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కోలాహలంగా జరిగింది. నాలుగు దశాబ్దాల తరువాత కలిసిన పూర్వవిద్యార్థులు ఆనాటి పూర్వస్మృతులను మననం చేసుకున్నారు. ఈ సందర్భంగా సమాజ సేవకు పూర్వ విద్యార్థులు ముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు. విద్యనేర్పిన గురువులను మననం చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కె.రామ్మోహనరావు, కార్యదర్శి కె.కిషోర్, ఎం.సుబ్బారావు, వై.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా చివలూరు - మున్నంగి రహదారి

● గోతులమయంగా మారిన రోడ్డు ● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



గోతులమయంగా ఉన్న చివలూరు - మున్నంగి రోడ్డు

కొల్లిపర, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అధికారుల పర్యవేక్షణలోపం.. కాంట్రాక్టర్ల స్వార్థం.. వెరసి సుదీర్ఘకాలంగా ఉండాల్సిన రోడ్లు అనతి కాలంలోనే దెబ్బతింటున్నాయి. ఈ రోడ్లపై ప్రయాణం చేయాలంటేనే నరక ప్రాయంగా మారుతోంది. రోడ్లు దెబ్బతిన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు, వాహన చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో చిలూరు - మున్నంగి వెళ్ళే రోడ్డు 13 సంవత్సరాల క్రితం ప్రధాన మంత్రి గ్రామసడక్ యోజన పథకం ద్వారా 2.48కోట్ల రూపాయలతో నిర్మించారు. రోడ్డు నిర్మించిన సంవత్సరానికే పూర్తిగా దెబ్బతింది. రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నప్పటికి అధికారులు మాత్రం రోడ్డు గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. అనేక పర్యాయాలు దెబ్బతిన్న రోడ్డు గురించి సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా కన్నెత్తి కూడా చూడలేదు. దీంతో ఆ రోడ్డుపై నడవాలంటే వాహనదారులు, రైతులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు గులకరాళ్లు పైకి లేచి, గుంతలుగా ఉండటంతో రైతులు తమ పంటలను ఇళ్లకు తీసుకెళ్ళాలంటేనే అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు చివలూరు సమీపంలో పంట కాల్వపై ఏర్పాటు చేసిన కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. కల్వర్టుకు ఏర్పాటు చేసిన గోడలు బీటలు వారటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు, వాహనదారులు భయపడుతున్నారు. కల్వర్టు గురించి డ్రైనేజి అధికారులకు అనేక పర్యాయాలు తెలియజేసినా పట్టించుకోలేదు. దీంతో రైతులు డ్రైనేజి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టుకు ఇరుపక్కలా ఏర్పాటు చేసిన సైడ్‌వాల్స్ పూర్తిగా దెబ్బతినటంతో రాత్రి సమయాల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రైతులకు ఎంతో ఉపయోగపడే ఈ రోడ్డు దెబ్బతినటంతో పలువురు ఆవేదన చెందుతున్నారు. అంతేకాకుండా వల్లభాపురం నుంచి మున్నంగి చివలూరు మీదుగా తెనాలి వెళ్లడానికి ఈ రహదారి అతి దగ్గరగా ఉండటంతో ఎప్పుడు రద్దీగా ఉంటుంది. రోడ్డు పూర్తిగా దెబ్బతినటంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుతో పాటు కల్వర్టును కూడా నిర్మించాలని రైతులు, వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, చివలూరు గ్రామస్థులు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఎటువంటి రక్షణ గోడలు లేని చివలూరు సమీపంలోని కల్వర్టు

పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న హామీ నెరవేర్చాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్



సమావేశంలో ప్రసంగిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్

పెదకాకాని, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామంటూ ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పెదకాకానిలో పొన్నూరు నియోజకవర్గ సీపీఐ మహాసభను నిర్వహించారు. ఈ మహాసభకు గుంటూరు జిల్లా రైతు సంఘం కార్యదర్శి కొల్లి రంగారెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న అర్హులైన నిరుపేదలకు రెండు సెంట్ల స్థలాలు, గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు మూడు సెంట్లు స్థలాలు కేటాయించి గృహ నిర్మాణానికి ఐదు లక్షల రూపాయల ఆర్థికసాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' వాగ్దానాను నెరవేర్చేవరకు సీపీఐ నిరంతర పోరాటం కొనసాగిస్తోందని స్పష్టం చేశారు. సమావేశంలో సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శిగా పుప్పాల సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కమిటీ సభ్యులుగా కొల్లి రంగారెడ్డి, ఆరేటి రామారావు, రెంటాల కుమారి, పాటిబండ్ల డేవిడ్‌రాజు, షేక్ గౌస్, కూసం నాగిరెడ్డి, షేక్ బాసీదు, కేతినేని అగస్టీన్, రావూరి సుగుణలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేత మేడా హనుమంతరావు, గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆకిటి అరుణ్‌కుమార్, మహిళా సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి గుండెబోయిన లక్ష్మి, ఏఐటీయూఐసీ గుంటూరు నగర కార్యదర్శి రావుల అంజిబాబు, రామిశెట్టి శ్రీనివాసరావు, బొట్టు శ్రీనివాసరావు, బట్టు నాగేశ్వరరావు, గోపి, సుబ్బారావు, మండే రవి, దర్శి లింగారావు, నారా ప్రసాదు, ఎస్.సత్యనారాయణ, ఉయ్యూరు సీతారామయ్య, రమణ, తాండవకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శారద

మధుమేహ బాధితులకు వైద్య శిబిరం

తెనాలి అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బుర్రిపాలెం రోడ్డులోని శారదా సర్వీస్ సొసైటీలో ఆదివారం షుగర్ వ్యాధిగ్రస్థులకు వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మధుమేహ వ్యాధిగ్రస్థులకు డాక్టర్ శారద వైద్యసేవలు అందించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు అల్పాహారం అందజేశారు. బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. షుగర్ వ్యాధి నియంత్రణకు తీసుకోవాల్సిన ఆహారం, వ్యాయామం, పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేసి వివరించారు. మందులపై ఆధారపడకుండా ఆహార నియమాలు పాటించాలని, తగిన వ్యాయామం చేయాలన్నారు. 300మందికి పైగా రోగులు హాజరయ్యారు. ప్రతినెలా చివరి ఆదివారం నిర్వహించే శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నెలకు సరిపడా మందులు కూడా అందజేస్తున్నామని చెప్పారు.

కంటిశుక్లంపై అవగాహన శిబిరం

తెనాలి అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కంటి శుక్లం రావడానికి గల కారణాలను చికిత్స విధానాలను డాక్టర్ తాళ్లూరి మౌళికృష్ణ వివరించారు. కవిరాజా పార్కులో ఆదివారం సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. మొవ్వా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైద్యులు కంటి సమస్యలపై అవగాహన కల్పించారు. 50ఏళ్ల వయసులో 50 శాతం మందికి 60ఏళ్ల వయసులో 70శాతం మందికి, 80ఏళ్ల వయసులో 90శాతం మందికి శుక్లాలు ఏర్పడతాయన్నారు. దీనికి సర్జరీ తప్ప ఎలాంటి మందులు లేవని, కంటిలోపల కృత్రిమ అద్దాలు ఏర్పాటు చేస్తారని చెప్పారు. పూర్వం శుక్లం ముదిరేవరకు చికిత్స చేసేవారు కాదని, ప్రస్తుతం శుక్లం మొదలయ్యాక ఎప్పుడైనా చికిత్స చేయవచ్చన్నారు. సమావేశంలో పాల్గొన్న సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. జ్ఞానేంద్రప్రసాద్, ఈశ్వర్‌చంద్, కోటయ్య, పూర్ణచంద్రరావు, చలమయ్య పాల్గొన్నారు.



డాక్టర్ మౌళికృష్ణను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు



విద్యార్థులకు నగదు అందజేస్తున్న హెన్రీ క్రిస్టినా, మధు, విజయ్, ఆనంద్‌కుమార్ తదితరులు

విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి చేరాలి

● జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టీనా

తెనాలి అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానం చేరాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టీనా చెప్పారు. తెనాలి బీజేఆర్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పదో తరగతిలో 525 మార్కులు దాటిన 120మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేలు నగదు, బ్యాగ్, వాటర్ బాటిల్, డిక్షనరీ బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమయాన్ని వృథా చేయకుండా సెల్‌ఫోన్, టీవీలతో కాలక్షేపం చేయకుండా లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా ముందుకు వెళ్లాలన్నారు. రాష్ట్ర జీఎస్‌టీ ఆడిట్ కమిషనర్ పి.ఆనంద్‌కుమార్‌ను, ఐఆర్‌ఎస్ అధికారి దోనేపూడి విజయబాబు, విశ్రాంత ఐఏఎస్ అధికారి మధుబాబు, వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్ మట్లపూడి సంధ్యారాణి, కమిటీ గౌరవ అధ్యక్షుడు అత్తోట శరత్‌బాబు, మేకల సురేష్, నలుకుర్తి రమేష్, సద్గుణరావు, కమలాకర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. కమిటీ ఆధ్వర్యంలో అతిథులను సన్మానించారు.

వ్యర్థాలతో నిండిన జగ్గడిగుంటపాలెం కాలువ

● దుర్గంధం, దోమలతో స్థానికులకు ఇబ్బందులు
● గతంలో స్థానికులే శుభ్రం చేసుకున్న పరిస్థితి
● అధికారులు పట్టించుకోవాలని వేడుకోలు



వ్యర్థాలతో నిండి ఉన్న జగ్గడిగుంటపాలెం కాలువ

తెనాలి రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జగ్గడిగుంటపాలెం సమీపంలో పంటకాలువ వ్యర్థాలతో నిండిపోయింది. ఫలితంగా స్థానికంగా నివసించే ప్రజలు దుర్గంధంతో పాటు దోమల వృద్ధితో అల్లాడిపోతున్నారు. గతంలో ఇదే కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను సంబంధిత శాఖ అధికారులు తొలగించకపోవడంతో స్థానిక యువకులే స్వచ్ఛందంగా శుభ్రం చేసుకున్నారు. ప్రస్తుతం అదే ప్రాంతంలో ప్లాస్టిక్, తుంగ, ఇతర వ్యర్థాలు నిండి రోజుల తరబడి నిలిచి ఉండటంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దీంతో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు కాలువలో వ్యర్థాల తొలగింపు పనులు చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



నంబూరులో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

నంబూరులో తాగునీటి సమస్యను పరిష్కరిస్తా

● ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పెదకాకాని, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నంబూరులో శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కారం చేస్తామని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. ఆదివారం మండలం నంబూరు అంబేద్కర్‌నగర్ ఏరియాలో రూ.50లక్షల జల్‌జీవన్ మిషన్ నిధులతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ నంబూరులో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేయిస్తున్నామన్నారు. గ్రామానికి కావలసిన అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామంలోని తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.